

0933520440
09305978486
09794359502

PRAYAG TEERTH PUROHIT
KRISHNA SHASTRI
AND HIS SON
ORGD : BY BHAIYAN SHASTRI (BABU GARU)
32, Daragani Near Police station PRAYAGARAJ.
GANGARAM PRABHAULALJI & SONS



VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal License No. VSP / 96/ 2021 - 23
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్



Sugar Free
Fitearly
రెండుపూటలా సేవించండి.
శక్తివంతంగా జీవించండి.
వివరములకు
8247526179
డీలర్లు కావలెను.



RNI No.52722/90 సంపుటి : 32 సంచిక : 222 విశాఖపట్నం, 16 జూన్ 2023 శుక్రవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00


## ఏపీలో జియో జోరు- ఒకేసారి వంద టవర్లను ప్రారంభించిన జగన్



**అమరావతి:** రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకు 4జి సేవలు అందుబాటులోకి రానున్నాయి. 100 జియో టవర్స్‌ను తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం జగన్ వర్చువల్‌గా ప్రారంభించారు. దీని ద్వారా 209 మారుమూల గ్రామాలకు సేవలు అందనున్నాయి. అల్లూరి సీతారామ రాజు జిల్లాలో 85 టవర్లు, పార్వతీపురం మన్యం జిల్లాలో 10 టవర్లు, అన్నమయ్య జిల్లాలో 3 టవర్లు, వైయస్సార్ జిల్లాలో 2 టవర్లను సీఎం ప్రారంభించారు.

రాష్ట్రంలో సెల్ సర్వీసులు లేని 5,459 ఆవాసాలకు సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని సీఎం జగన్ పేర్కొన్నారు. అందుకు సహకరించిన కేంద్ర ప్రభుత్వ టెలీ కమ్యూనికేషన్స్ విభాగానికి, జియోకు, ఎయిర్‌టెల్, బీఎస్ఎన్ఎల్ అందిరికీ సీఎం ధన్యవాదాలు తెలిపారు. డిసెంబరు నాటికి రాష్ట్రంలో సెల్ సర్వీసులు లేని ఆవాసాలకు ఇంటర్నెట్ కనెక్టివిటీతో పాటు పెద్ద ఎత్తున మార్పులు రానున్నాయని పేర్కొన్నారు. దీంతో అన్ని సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్స్, స్కూళ్లకూ

(మిగతా 2లో)

## స్టార్టప్, ఇంక్యుబేషన్ రంగాలలో ఏయూ అద్వితీయ ప్రగతి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** స్టార్టప్, ఇంక్యుబేషన్ రంగాలలో ఆంధ్ర విశ్వవిద్యాలయం అద్వితీయ ప్రగతి సాధిస్తోందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. గురువారం ఏయూ సెనేట్ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ప్రారంభించిన తొలి ఏడాది కాలంలోనే అనేక విజయాలను అందుకున్నాయన్నారు. ఇటీవల జాతీయ స్థాయిలో కేంద్ర విద్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఎన్ఐఆర్ఎఫ్ ఇన్నోవేషన్ ర్యాంకింగ్‌లో ఏయూ 15వ స్థానంలో నిలిచిందన్నారు. అదే విధంగా ఇన్నోవేషన్ కౌన్సిల్‌లో జాతీయ స్థాయిలో తొలి సంవత్సరమే 4 స్టార్ రేటింగ్‌ను సొంతం చేసుకుందన్నారు. దేశ వ్యాప్తంగా కేవలం 5 సంస్థలు మాత్రమే 4 స్టార్ రేటింగ్‌ను సాధించాయని, వీటిలో ఏయూ ఒకటి కావడం గర్వ కారణమన్నారు. జాతీయ విద్య సంస్థలైన ఐఐటిలతో పోటీ పడుతూ ఏయూ ఇంక్యుబేషన్, స్టార్టప్ సెంటర్ పనిచేస్తోందన్నారు. 2024 చివరి నాటికి ఏయూలో 200పైగా సంస్థలు పనిచేయడం, నెలకొల్పడం లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఇప్పటికే వందకు పైగా స్టార్టప్ సంస్థలు ఏయూ కేంద్రంగా పనిచేస్తున్నాయన్నారు.

విశాఖ నగరాన్ని ఎకనామిక్ జోన్‌గా తీర్చిదిద్దే సత్తా ఏయూలో నెలకొల్పే స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్‌లకు ఉంటుందన్నారు. టెక్ స్టార్టప్, ఫుడ్ ఇంక్యుబేషన్, ఫార్మ ఇంక్యుబేషన్, మెరైన్ ఇంక్యుబేషన్ వంటివి

(మిగతా 2లో)

## నిషేధిత ప్లాస్టిక్ పై స్పెషల్ డ్రైవ్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ కమిషనర్ సి.ఎం. సాయికాంత్ వర్మ ఆదేశాలతో జివిఎంసి ఉన్నతాధికారుల నుండి వార్డు సచివాలయం కార్యదర్శులు వరకు నగర పరిధిలో నిషేధిత ప్లాస్టిక్ నిర్మూలన పై ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమం గురువారం నిర్వహించడం జరిగిందని జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ 8 జోన్లలో ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ కలిగి ఉన్న పలు దుకాణాల నుండి భారీ ఎత్తున అపరాధ రుసుము వసూలు చేయడంతో పాటు నిషేధత ప్లాస్టిక్‌ను కూడా పట్టుకున్నామన్నారు. నగర పరిధిలో సాయంత్రం 6 గంటల వరకు ప్రత్యేక డ్రైవ్ ద్వారా 5694 దుకాణాల నుండి 882.7 కేజీల నిషేధిత ప్లాస్టిక్‌తో పాటు రూ.3,43,070/- అపరాధ రుసుం విధించామన్నారు. ఈ దాడులు ఇంకా కొనసాగుతున్నాయని తెలిపారు.

ప్రతి దుకాణదారునికి ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తూ, ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేయాలని ప్రత్యేక డ్రైవ్ బృందం అవగాహన కల్పించిందన్నారు. నిషేధిత ప్లాస్టిక్ అమ్ముతున్న దుకాణాదారుల నుండి మూడుసార్లు వరకు అపరాధ రుసుం వసూలు చేస్తామని ఆపై నిషేధిత ప్లాస్టిక్ కలిగి ఉన్న దుకాణానికి తాళాలు వేస్తామని హెచ్చరించారు. విశాఖ నగరంలో ప్లాస్టిక్ నిర్మూలనే లక్ష్యంగా జివిఎంసి కమిషనర్ పనిచేస్తున్నారని భావితరాల కొరకు

(మిగతా 2లో)

## అంగన్వాడీ కేంద్రాలను సందర్శించిన బీజేపీ మహిళా నేతలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ప్రధాని నరేంద్ర మోడీ 9 సంవత్సరముల సుపరిపాలనలో మన రాష్ట్రానికి చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల ప్రచారంలో భాగంగా విశాఖ నగరంలో స్కిల్ డెవలప్మెంట్ సెల్ కన్వీనర్ నాదెళ్ల జ్యోతి ఆధ్వర్యంలో గురువారం జిల్లా స్థాయి కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే ప్రాజెక్టులు అయినటువంటి హెల్త్ కేర్ సెంటర్స్ మరియు అంగన్వాడీ సెంటర్స్‌ని సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్టేట్ అఫీషియల్ స్పోక్స్ పర్సన్ సుహాసిని ఆనంద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సాధించిన ఘనతతో దేశంలో ప్రతి ఒక్కరికీ కమ్యూనికేషన్ అందించి, ప్రతి ఒక్కరూ మరొకొరి వద్ద ఉద్యగం చేసేలా కాకుండా , మరో 100 మందికి ఉద్యోగం ఇచ్చేలా ఉండాలని, మోడీ ఆశయాలకు అనుగుణంగా అడుగులు వేస్తున్న నగరంలో స్కిల్ డెవలప్మెంట్ విజయవంతంగా

(మిగతా 2లో)

## విశాఖ ఎంపీ భార్య, కుమారుడి కిడ్నాప్ కలకలం ?



ఎంవీవీ కుమారుడు చందు



ఎంవీవీ భార్య జ్యోతి



ఆడిటర్ జీవీ

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ వైసీపీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కుటుంబాన్ని గురువారం గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. గురువారం ఉదయం వైజాగ్ ఎంపీ భార్య, కుమారుడిని కిడ్నాప్ చేసిన కిడ్నాపర్లు, అనంతరం వారితో ఫోన్ చేయించి ఆడిటర్‌ను సైతం ఎత్తుకుపోయారు. అయితే విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం తొలుత ఆడిటర్ జీవీ సురక్షితంగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆ తర్వాత ఎంపీ భార్య, కుమారుడి ఆచూకీ కోసం గాలింపు కొన సాగుతుండగానే వారు కూడా సురక్షితంగా ఉన్నట్లు తేలింది.

### 50 కోట్లు డిమాండ్ - రక్షించిన పోలీసులు..!



(మిగతా 2లో)

## మహిళామోర్చా కమిటీతో సుజాత పాండే సమావేశం

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** బుధవారం నేషనల్ సోషల్ మీడియా ఇన్చార్జ్ సుజాత పాండే విశాఖపట్నం పర్యటన సందర్భంగా భారతీయ జనతా పార్టీ విశాఖపట్నం జిల్లా కార్యాలయంలో బీజేపీ జిల్లా మహిళా మోర్చా కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుజాత పాండే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలతో లబ్ది పొందిన లబ్ధిదారులతో కోటి సెల్ఫీ కార్యక్రమాలు ఏ విధంగా చేపట్టాలో దిశా నిర్దేశం చేస్తూ, కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలను పోలింగ్ బూత్ స్థాయి వరకు తీసుకెళ్లాలని అన్నారు. కమిటీ సభ్యులందరు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండేటట్లుగా దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి రోహిణి వత్సవాయి, బీజేపీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉమ్మిడి సుజాత రాజ్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కారుభుక్త పద్మ, జిల్లా ఉపాధ్యక్షురాలు తలాడ గిరిజ, మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి కళ్యాణి, వార్డు అధ్యక్షురాలు స్పందన తదితరులు పాల్గొన్నారు.


## పిఠాపురం కాలనీ సమాచారం

త్వరలో వెలువడనున్న పిఠాపురం కాలనీ సమాచారం ప్రత్యేక సంచికలో స్థానికంగా ఉన్న దుకాణదారులు, విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, హోటళ్లు, వైద్యులు, న్యాయవాదులు, ఆసుపత్రులు, పురోహితులు, దేవాలయాలు, సంగీత పాఠశాలలు తదితర వివరములు అందించబడతాయి. ఈ సమాచారం పూర్తిగా ఉచితంగా ప్రచురించబడుతుంది.

మీ సంస్థకు లేదా దుకాణానికి సంబంధించిన వివరములు నమోదు చేసుకునేందుకు వాట్సాప్ ద్వారా 7013785256 నెంబరుకు మీ వివరములు/విజిటింగ్ కార్డు పంపించండి. ఈ ప్రత్యేక సంచికలో ప్రకటనల కొరకు మరియు ప్రతీరోజు పత్రిక కొరకు సుధాకర్ సెల్: 7981904385, తులసీరామ్ : సెల్ : 8186030813 నెంబర్లకు సంప్రదించండి.

విశాఖ సమాచారమ్ తెలుగు దినపత్రిక,
9-3-16, పిఠాపురం కాలనీ, విశాఖపట్నం-530003
ఫోన్ : 9393949345


## పార్లమెంటు టికెట్‌కు బిజెపిలో పోటీ?

-టి. శిరీష



తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీల పొత్తు దాదాపుగా ఖరారైనట్లుగా భావించబడుతున్న సందర్భంలో విశాఖపట్నం లోక్‌సభ స్థానానికి పోటీ చేసే అభ్యర్థుల విషయంలో సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఈ స్థానం నుండి పోటీ చేసి గెలుపొందిన అభ్యర్థులలో భాట్టం శ్రీరామ మూర్తి, ఎం.వి.వి.ఎస్.మూర్తి తెలుగుదేశం నుండి గెలుపొందగా, భాజాపా తరఫున దగ్గుబాటి పురందేశ్వరి, కంభంపాటి హరిబాబు గెలుపొందారు. మధ్యలో కాంగ్రెస్ తరఫున టి. సుబ్బరామి రెడ్డి కూడా గెలుపొందారు. తాజాగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున విశాఖ లోక్ సభ సభ్యునిగా ముళ్ళపూడి సత్యనారాయణ (ఎంవివి) ప్రజాప్రతినిధిగా ఉన్నారు.

ప్రస్తుత ప్రభుత్వ పాలన నాలుగేళ్ళు పూర్తి చేసుకొని ఎన్నికలు మరో ఏడాదిలో సమీపిస్తున్నాయనగా, జిల్లాలో ఎన్నికల సందడి మొదలైంది. పొత్తుల విషయం ఇటీవలే అనుకూలంగా మారినప్పటికీ సుమారు ఏడాది కాలంగా విశాఖపట్నం లోక్‌సభ స్థానం నుండి పోటీ చేసేందుకు రాజ్యసభ సభ్యులు జి.వి.ఎల్. నర్సింహారావు ప్రయత్నిస్తున్నారు. జి.వి.ఎల్. విశాఖపట్నానికి రాకపోకలు ప్రారంభించినప్పటి నుండి నగర బిజెపి కార్యాలయంలో సందడి మొదలైంది. జిల్లా మరియు నగర అధ్యక్షుడు రవీంద్ర రెడ్డి మినహా విశాఖ బిజెపిలో జేబులోంచి రూపాయి బయటకు తీయడానికి ఎవరూ ముందుకు రారు అనే అపవాదు ఉంది. పని ఉన్నా లేకపోయినా ఏదో ఒక వంకతో పసలేని విషయాలతో పాత్రికేయుల సమావేశాలు ఏర్పాటు చేయడం, అందుకోసం పదే పదే రికార్డెడ్ సందేశాల ద్వారా ఆహ్వానాలు పంపడం, మంచి వార్త దొరుకుతుందని ఆశపడి వెళ్ళే పాత్రికేయులు నిరాశ, నీరసాలతో వెనక్కిరావడం, ప్రెస్‌మీట్ కాస్తా తుస్సుమనడం పరిపాటిగా మారింది.

విశాఖ బిజెపిలో పనిచేసే వాళ్ళని నిరుత్సాహ పరుస్తారనే ప్రచారం కూడా ఉంది. క్రమశిక్షణ పేరుతో ఎవరికీ స్వేచ్ఛ ఇవ్వరనీ, ప్రచారం అంటే అసలు గిట్టదని, అధినాయకత్వం నిరంకుశత్వానికి చాలా మంది వెనక్కి తగ్గిపోయారని కూడా చెప్తారు. నాయకులుగా చెప్పుకోబడుతున్న వాళ్ళు పార్టీలోని కార్యకర్తలను చేరదీయరని, ఎవరికీ ఏ కష్టమొచ్చినా ఆదుకోరనీ, స్థానిక సంస్థల ఎన్నికలలో కూడా ఆర్థికంగానూ, సామాజికంగానూ, వ్యక్తిగతంగానూ కూడా సహకరించరని కార్యకర్తలు వాపోతుంటారు.

అటువంటి స్థితి నుండి ప్రతి ఒక్కరిలోనూ ఉత్సాహం నింపేలా జివిఎల్ ఏడాది కాలంగా అనేక కార్యక్రమాలు నిర్వహించారు. భోగి పండుగకు పెద్ద వేడుకే చేసారు. భారీ ఎత్తున గంగిరెద్దులు, సన్నాయి మేళాలతో అనేకమంది కళాకారులతో భోగి మంట వేసి సుమారు వెయ్యి మందికి విందు చేసిన ఘనత ఆ పార్టీలో జివిఎల్‌కే దక్కింది.

వృద్ధాప్య పెన్షన్ తీసుకొని కండువా, కళ్ళజోడు సర్దుకుంటూ వెళ్ళిపోయే నాయకత్వం గల విశాఖ బిజెపిలో జివిఎల్ నిర్వహించిన ఉగాది, హెూళీ వేడుకలు కార్యకర్తల్లో మరింత ఉత్సాహం పెంచాయి. కార్యకర్తల సంఖ్య క్రమక్రమంగా పెరుగుతూ వారిలో ఉత్సాహం పెరుగుతున్న సమయంలో కొంతమంది కుళ్ళు రాజకీయాలకు తెరతీసినట్లుగా సోషల్ మీడియాలో ప్రచారం మొదలైంది.

తెలుగుదేశం, జనసేన, బిజెపి సంఘటితమై బిజెపి అభ్యర్థిని ఉమ్మడి అభ్యర్థిగా లోక్‌సభకు పోటీలో పెడితే గెలవడం ఖాయం. అలాంటి సునాయాస గెలుపును మరొక వ్యక్తికి దక్కింపజేసేందుకు ఇటీవల జరిగిన అమిత్ షా బహిరంగ సభను కొందరు వ్యక్తులు వేదికగా చేసుకొని జివిఎల్ అమిత్ షా హిందీ ప్రసంగాన్ని తారుమారు చేశారనీ, హెూం మంత్రి వైసిపి పాలనను విమర్శిస్తుంటే జివిఎల్ తెలుగులో దానిని ప్రశంసగా మార్చారనీ వక్రభాష్యం తీసుకువచ్చారు. దీనికి అనుబంధంగా ఒక వీడియో క్లిప్‌ను కూడా జతపరిచారు.

మైకు హెూరులో ఒకచోట జివిఎల్ తడబడిన మాట వాస్తవమే కానీ ఆ అంశంలో మన్మోహన్ సింగ్‌ను గురించి ప్రస్తావన ఉంది గానీ, జగన్ లేదా వైకాపాల పేరు ఎక్కడా లేదు. జివిఎల్ నిక్కచ్చి అనువాదానికి అనేకమార్లు సభికులు కేరింతలు కొట్టారు. చప్పట్లు మారుమ్రోగాయి. స్వర్గీయ ద్రోణంరాజు సత్యనారాయణ సభలలో పూర్వం ఆయన వేసే చెణుకులకు, చేసే విమర్శలకు సభలు ద్దరిల్లేవి. అనంతరం ఏ రాజకీయ సభలోనూ, ఆఖరికి ప్రధాని నరేంద్రమోదీ సభలో కూడా సభికులు ఏ మాత్రమూ స్పందించలేదు. ఇక వైసిపి సభలైతే గిలిగింతలు పెట్టి నవ్వించే మాదిరిగా తయారయ్యాయి.

అలాంటిది జివిఎల్ అనువాదానికి వక్రభాష్యం చేసి వైసిపి నేతలు విమర్శలు గుప్పిస్తుంటే నగరంలోని బ్రాహ్మణ సంఘాలు భగ్గుమంటున్నాయి. జివిఎల్ వంటి నాయకుడిని నిరుత్సాహపరిచేందుకు ఎవరైనా విమర్శిస్తే వారికి శాపనార్థాలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

## (మొదటి పేజీ తరువాయిలు)

### ఏపీలో జియో జోరు- ఒకేసారి వంద టవర్లను ప్రారంభించిన జగన్

ఇంటర్నెట్ కనెక్షన్ లభిస్తుందని అన్నారు. రేషన్ పంపిణీ, ఇ-క్రాప్ బుకింగ్ కూడా సులభమవుతుందని చెప్పారు. తద్వారా రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలును అత్యంత పారదర్శకంగా, లంచాలకు, వివక్షకు తావులేకుండా అక్కచెల్లెమ్మలకు అందించ గలుగుతామని తెలిపారు.

టవర్లను ఏర్పాటు చేసిన రిలయన్స్ జియో సంస్థ భవిష్యత్తులో 5జీ సేవలను అప్గ్రేడ్ చేయనుంది. ఈ కార్యక్రమంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ మంత్రి గుడివాడ అమర్నాథ్, సీఎస్ డాక్టర్ కె ఎస్ జవహర్ రెడ్డి, ఐటీ సెక్రటరీ కోన శశిధర్, రిలయెన్స్ జియో ప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏఎస్ఆర్ జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, అధికారులు, ఇతర ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. తద్వారా ఆయా ప్రాంతాల్లోని గిరిజనులతో సీఎం జగన్ ఇంటరాక్ట్ అయ్యారు.

ఈ ప్రాజెక్టు కింద కొత్తగా 2,704 ప్రాంతాల్లో టవర్ల ఏర్పాటు చేయనున్నారు. దీనికోసం ఇప్పటికే 2,363 చోట్ల స్థలాలు ప్రభుత్వం అప్పగించింది. డిసెంబర్ నాటికి అన్ని ప్రాంతాల్లో టవర్లు ఏర్పాటుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది.

### స్టార్టప్, ఇంక్యుబేషన్ రంగాలలో ఏయూ అద్వితీయ ప్రగతి

ఏయూలో విభిన్న ప్రాంతాలలో నెలకొల్పామని, త్వరలో ఇవి పూర్తిస్థాయిలో సేవలు ప్రారంభిస్తాయన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల యువతలోని నవ్య ఆలోచనలకు ప్రోత్సహిస్తూ, మార్గనిర్దేశం అందిస్తూ వారు పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడానికి కృషిచేస్తామన్నారు.

ఏయూలో ప్రారంభించి, పనిచేస్తున్న సేండ్ లాజిక్ సంస్థ చిప్ టెక్నాలజీపై పనిచేస్తోందన్నారు. దీనికి రూ 5 కోట్లకు పైగా గ్రాంట్ లభించిందన్నారు. విద్య, వైద్య, రక్షణ, బ్యాకింగ్ రంగాలకు ఉపయుక్తంగా ఏఐ ఆధారితంగా పనిచేసే చిప్‌ను అభివృద్దిచేయడం, ఉత్పత్తి చేసే దిశగా ఈ సంస్థ పనిచేస్తోందని సంస్థ నిర్వాహకులు డి.కమలాకర్, రవికుమార్‌లను పరిచయం చేసారు. ఏయూ నుంచి వచ్చిన మరొక అంకుర సంస్థ గ్రీన్ జామ్స్ సంస్థ పర్యావరణహిత ఇటుకలను తయారు చేస్తున్న విధానం వివరించారు. ఇప్పటికే ఈ సంస్థ 50 వేల అమెరికన్ డాలర్ల గ్రాంట్‌ను సాధించిందన్నారు. సంస్థ నిర్వాహకులు తరుణ్ జామిని పరిచయం చేసారు. ఏయూలో స్థాపించిన మరొక సంస్థ తారమండల్ ఇటీవల ప్రతిష్టాత్మకమైన ప్యారిస్ పీస్ ఫౌండేషన్‌తో కలసి పనిచేసే అవకాశం సాధించిందన్నారు. భారత దేశం నుంచి ప్యారిస్ పీస్ ఫౌండేషన్‌తో కలసి పనిచేస్తున్న నాల్గవ సంస్థగా తారమండల్ నిలుస్తుందని సంస్థ వ్యవస్థాపకుడు వినీల్ జడ్సన్‌ను పరిచయం చేసారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్ సిఈఓ రవి ఈశ్వరపు తదితరులు ప్రసంగించారు.

### నిషేధిత ప్లాస్టిక్ పై స్పెషల్ డ్రైవ్

ప్రమాదకరమైన ప్లాస్టిక్‌ని వాడరాదని పేర్కొన్నారు.

ఈ స్పెషల్ డ్రైవ్‌లో జివిఎంసి ఉన్నతాధికారులు, జోనల్ కమిషనర్లు, పర్యవేక్షక ఇంజనీర్లు, వార్డ్ స్పెషల్ ఆఫీసర్లు, కార్యనిర్వాహక ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, వార్డు సచివాలయం కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

### అంగన్వాడీ కేంద్రాలను సందర్శించిన బీజేపీ మహిళా నేతలు

నడుపుతున్న జ్యోతికి అభినందనలు తెలిపారు. మోడీ ఆశయాలను రాష్ట్ర, జిల్లా నాయకులతో కలిసి ముందుకు తీసుకు వెళతామని అన్నారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ కన్వీనర్ దాడి రమేష్ , జిల్లా కార్యదర్శి చల్లా మంజుల, ఎస్సీ మోర్చా స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పల్లి మాధవి లత, మండల అధ్యక్షులు గోట్టివాడ వెంకటేశ్వరరావు, మండల జనరల్ సెక్రెటరీ సురేష్, ఓ.బి.సి వలిరెడ్డి శ్రీను పాల్గొనడం జరిగింది.

### విశాఖ ఎంపీ భార్య, కుమారుడి కిడ్నాప్ కలకలం ?

విశాఖలోని రుషికొండలో ఉన్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ భార్య, కుమారుడిని ముందుగా కిడ్నాప్ చేసిన అగంతకులు అనంతరం ఆడిటర్‌కు వీరితో ఫోన్ చేయించి కిడ్నాప్ చేశారు. కిడ్నాప్ జరిగిన సమయంలో ఎంపీ సత్యనారాయణ హైదరాబాద్‌లో ఉన్నారు. ఆర్థిక లావాదేవీల కారణంగానే ఈ కిడ్నాప్ జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే ఎంపీ భార్య, కుమారుడిని ఆగంతకులు ఎక్కడికి తీసుకెళ్లారనేది తెలుసుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. వీరిని విశాఖ-ఏలూరు జాతీయ రహదారి సమీపంలో గుర్తించినట్లు తెలుస్తోంది.

ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ తాజాగా రుషికొండలో ఇల్లు కట్టుకుని అక్కడికి మారినట్లు తెలుస్తోంది. స్వతహాగా సినీ నిర్మాతతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారి కూడా అయిన ఎంపీకి స్థానికంగా పలు ఆర్థిక లావాదేవీల వివాదాలు ఉన్నాయి. గతంలో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ఈయనపై బహిరంగంగానే విమర్శలు కూడా చేశారు. ఈ నేపథ్యంలో ఎంపీ కుటుంబ సభ్యుల్ని కిడ్నాప్ చేయడం ద్వారా ఆయన్ను బెదిరించేందుకు కిడ్నాపర్లు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. ఎంపీ కుటుంబ సభ్యుల్ని కిడ్నాప్ చేసి వీరు రూ.50 కోట్లు డిమాండ్ చేసినట్లు సమాచారం.

విశాఖ నుంచి 2019లో తొలిసారి వైసీపీ ఎంపీగా గెలిచిన ఎంవీవీ సత్యనారాయణకు స్థానిక పార్టీ నేతలకూ మధ్య పొసగడం లేదు. గతంలో విశాఖ ఇన్‌ఛార్జ్‌గా ఉన్న విజయసాయిరెడ్డితో ఆయనకు పొసగని కారణంగానే ఆ తర్వాత జగన్ వైవీసుబ్బారెడ్డిని అక్కడికి పంపారు. అయితే స్థానికంగా రియల్ ఎస్టేట్ వ్యవహారాల్లో చురుగ్గా ఉంటున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు గతంలోనూ బెదిరింపులు వచ్చాయి.

## ఒకే కుటుంబంలో ఆరుగురి సజీవదహనం

**కుశినగర్:** ఉత్తరప్రదేశ్‌లోని కుశినగర్ జిల్లాలో ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. నిద్రిస్తున్న సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి తల్లితోపాటు ఐదుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. పిల్లలంతా పదేళ్ల లోపువారే. ఈ ఘటన జరిగినట్లు తాజాగా పోలీసులు వెల్లడించారు. ఉర్దా ప్రాంతంలో సంగీత (38) తన పిల్లలతో ఇంట్లో నిద్రిస్తుండగా. ఆమె భర్త, అత్తమామలు ఇంటిబయట నిద్రిస్తున్నారు. అందరూ గాఢ నిద్రలో ఉన్న సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగి గ్యాస్ సిలిండర్ పేలిపోయింది. క్షణాల్లోనే ఇల్లంతా మంటలు వ్యాపించాయి. ఇంతలో లోపల ఉన్న వారి అరుపులు విన్న భర్త, అత్తమామలు స్థానికులతో కలిసి వారిని కాపాడే ప్రయత్నం చేసినా మంటల తీవ్రత అధికంగా ఉండటంతో లోపలికి వెళ్లలేకపోయారు. ఈలోగా అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసి లోపల ఉన్న వారిని బయటకి తీసుకొచ్చారు. అయితే, అప్పటికే వారు మృతి చెందారు. మృతులను సంగీత, బాబు(1), గీత(2), రీత(3), లక్ష్మిణ(9), అంకిత్(10)గా గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పందించారు. విషాద ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితకుటుంబాన్ని అన్నిరకాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఒక్కొక్కరికి రూ.4 లక్షల చొప్పున మొత్తం రూ.24 లక్షల ఆర్థికసాయాన్ని అందజేయనున్నట్లు ప్రకటించారు.

## మానవసేవే మాధవసేవ



**గాజువాక, (విశాఖ సమాచారమ్):** గాజువాక మండలం 87వ వార్డు వడ్లపూడి లో గల భవిత దివ్యాంగుల కేంద్రం ప్రగాణంలో దివ్యాంగుల పిల్లల కోసం ప్రత్యేక ఫిజియోథెరపీ హాలు నిర్మాణం పనులు శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక వార్డు కార్పొరేటర్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి బొండా జగన్నాథం (జగన్ ) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభయ ఫౌండేషన్, స్పందన ఫౌండేషన్ వారి సొంత నిధులతో వారి సహకారంతో సుమారు ఆరున్నర లక్షల రూపాయలతో ఈ నిర్మాణ పనులు చేపట్టారని తెలిపారు. తన వార్డులోని ఇలాంటి గొప్ప కార్యక్రమాన్ని చేపట్టిన స్పందన ఫౌండేషన్ విశాఖపట్నం మరియు అభయ ఫౌండేషన్ హైదరాబాద్ అధ్యక్షులు ఈపూరి బుచ్చిరాజు మరియు రవి కలిదిండి ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు. ఈ ఫిజియోథెరపీ సెంటర్ వలన తన వార్డులో ఉన్న దివ్యాంగుల పిల్లలే కాకుండా గాజువాకలో ఉన్న దివ్యాంగుల పిల్లలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు, ఈపూరి సీతారామరాజు, ఫార్మా డైరెక్టర్ లీలారాణి, ప్రాజెక్ట్ ఆఫీసర్ బి శ్రీనివాసరావు, జిల్లా కోఆర్డినేటర్ అబ్దుల్లా, ఆశ, కొచ్చర్లపాటి రామరాజు, వార్డు నాయకులు బెల్లంకొండ రాజన్ రాజు, విజయరామరాజు, రమణమూర్తి, పి. దానయ్య, శ్రీనివాస్, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### పంచాంగం

శుక్రవారం 16-06-2023
శోభకృత్ నామ సంవత్సరము
ఉత్తరాయణం గ్రీష్మరుతువు
జ్యేష్ఠ మాసం

తిథి : బ. చతుర్దశి రా. 08.56
నక్షత్రం : ఆరుద్ర ప. 02.31
వర్జ్యం : ఉ. 09.52 ల 11.34

### రెవెన్యూ సేవలు, ప్రజా అర్జీల పరిష్కారం నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలి

**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** గురువారం కాకినాడ రెవిన్యూ డివిజన్ కార్యాలయంలో డివిజన్‌కు సంబంధించిన వివిధ రెవెన్యూ అంశములపై ఆర్డీవో సత్యన్నారాయణ డివిజన్, మండలం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ సమస్యల పరిష్కారానికి తీసుకువచ్చిన జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష, రీ సర్వే ప్రక్రియ క్రింద కాకినాడ రెవిన్యూ డివిజన్‌లో మొదటి దశలో 113 గ్రామాలలో రీ సర్వే పూర్తి అయిందని, రెండవ దశ రీసర్వేకి అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ముఖ్యంగా జగనన్నకి చెబుదాం, స్పందన, ప్రజా సమస్యల పరిష్కారానికి వచ్చే దరఖాస్తులపై నిర్ణీత గడువులో చర్యలు తీసుకోవాలని, అలాగే కాకినాడ ఏడీబీ రోడ్డు విస్తరణ కొరకు చేపట్టిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. రైతాంగానికి అవసరమైన కౌలు హక్కు పత్రాలు సిద్ధం చేయాలని వీటితోపాటు ఇతర రెవెన్యూ అంశాలైన ముటేషన్, కరెక్షన్స్, భూ మార్పిడి ప్రక్రియలు, మీసేవ దరఖాస్తులు, ఇండ్ల స్థలముల పంపిణీ, గ్రామ సచివాలయాలలో రిజిస్ట్రేషన్ సేవలు, కోర్టు కేసులు తదితర రెవెన్యూ అంశాలపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దారులు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, పరిపాలనాధికారి జి.వరహాలయ్య తదితరులు పాల్గొన్నారు.

విశాఖ సమాచారమ్
ప్రతులకు, ప్రకటనలకు
సెల్: 9393949345
8247526179

శ్వాసకోశ వ్యాధులకు ఉపశమనం

- 40 సంవత్సరాలు పైబడిన ప్రతీ ఒక్కరికి రక్తాన్ని సక్రమంగా ప్రసరించేలా చూసుకునే అవసరం ఉంది.
- మీ రక్తం నిర్ణీత వేగంతో శరీరంలోని ప్రతీ భాగానికి అందేలా చూసుకోవాలంటే మీకు వివిధ వన మూలికలతో కూడిన ప్రత్యేక ఔషధం సేవించవలసిన అవసరం ఉంది.

కార్డోరియం ప్లస్




కావల్సిన వారు సంప్రదించండి:
9393949347

మన రక్త ప్రసరణను సమతుల్యం చేయడమే కాకుండా గుండెలోని రక్త నాళములు, మెదడు యందలి రక్త నాళములు మరియు శ్వాసకోశముల యందలి నాడులను ధృఢంగా చేస్తుంది. వీటిలో ఉండే అడ్డంకులను త్వరితంగా అరగదీస్తుంది. ఫలితంగా మీరు గుండెపోటు, పక్షవాతం, ఉబ్బసం వంటి వ్యాధులు రాకుండా నివారించుకోగలుగుతారు. ఇప్పటికే బాధపడుతుంటే సంపూర్ణంగా జయించగలుగుతారు.

అన్ని గ్రామాలలోను, పట్టణాలలోను ప్రైవేట్ ప్రాక్టీస్ నిర్వహించే ఆర్ఎంపీ, పీఎంపీ, డీఏఎంపీ, బీఏఎంఎస్, హోమియో, నేచురోపతి, ఆల్టర్‌నేటివ్ మెడిసిన్, బీపీటీ అర్హతలు కలిగిన వైద్యులు, సాంప్రదాయ మూలికావైద్యం చేయువారు డీలర్‌షిప్ కొరకు సంప్రదించండి.స్వయం ఉపాధి పథకం కింద అలకనందా ఉత్పత్తులు విక్రయించగోరువారు కూడా సంప్రదించండి.

90 రోజుల కోర్సు కేవలం రూ. 2700/- మాత్రమే.
మీరు వాడండి- మిగిలిన వారిచే కూడా వాడించండి.
అందరూ ఆరోగ్యంగా ఉండండి.



జనహిత ట్రస్ట్(రి)
9-3-16, పిఠాపురం కోలని,
విశాఖపట్నం- 530003
ఫోన్: 8247526179

# విశాఖ సమాచారమ్

శుక్రవారం 16-06-2023


# గో హత్యను ఆపలేరా ?

గో హత్య మహాపాపం. ఆవును చంపితే వారు ఎన్నటికీ నరకకూపం నుండి బయటపడలేరు మరియు ఉత్తమ జన్మ లభించదు అని పురాణాలు చెబుతున్నాయి. మనదేశంలో ఆవును చంపి తినేవారి సంఖ్య లక్షలలో ఉంది. ఆవులను పాలు ఇచ్చినంత కాలం పోషించి అనంతరం కబేళాలకు విక్రయించేవారి సంఖ్య అత్యధికంగా ఉంది. పాలు ఇస్తున్న ఆవును ఎవరూ మాంసం కోసం విక్రయించరు. ఒకవేళ అలా విక్రయించినా, అలాంటి ఆరోగ్యకరమైన ఆవును తినేందుకు కొని చంపిన వారి కంటే క్రూరులు ఎవరూ ఉండరు. ఆవులను వ్యక్తిగత పోషణ సాధనంగా మాత్రమే గోపాలకులు కొనుగోలు చేస్తున్నారు. ఆవును కొని, దానిని మేపి తద్వారా పాలు పొంది విక్రయించి జీవనోపాధి పొందేవారు అత్యధికంగా ఉన్నారు. వీరు ఆవును ఆదాయ మార్గంగానే చూస్తున్నారు గానీ వీరిలో గోవుపట్ల గౌరవంగాని, ఆరాధనగాని, భక్తిగాని లేవు.

గోవులను సంరక్షించేవారు, గోసంరక్షణశాలలను నిర్వహించేవారు కూడా చాలామందే ఉన్నారు. గోసంరక్షణ కోసం పురపాలక సంఘాలలో కొన్ని ప్రత్యేక ప్రదేశాలు గతంలో ఏర్పాటు చేయబడ్డాయి. వీటిని పశువుల బందీ దొడ్లుగా పిలుస్తూ ఉంటారు. రోడ్లపై వదిలివేయబడిన పశువులను ఇక్కడ సంరక్షించి వాటికి ఆహారం, నీరు ఇచ్చేందుకు ఆయా పురపాలక సంఘాలలో ప్రభుత్వం శాశ్వత బడ్జెట్ కేటాయించింది. అంతేకాక ఎవరైనా పోషించుకుంటున్న ఆవులను రోడ్లపై వదిలితే వాటిని పురపాలక సిబ్బంది బంధిస్తే జరిమానా చెల్లించి వాటిని విడిపించుకునే విధానం కూడా ఉంది. పురపాలక చట్టంప్రకారం పట్టణ పరిధిలో పశువులను కట్టిఉంచడం లేదా పశువులశాలలను నిర్వహించడం, వరి పండించడం వంటి వాటిని నిషేధించారు. కానీ అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్ల, కార్పొరేటర్ల ప్రమేయంతో ఈ చట్టం అమలు కావడం లేదు. ఫలితంగా దోమల విజృంభణ, పురుగుల బాధ, ఈగల కారణంగా వ్యాధులు ప్రబలే సమస్య ఇంకా పట్టణాలను, నగరాలను పట్టిపీడిస్తున్నాయి. ప్రజలలో కూడా ఫిర్యాదు చేసే తత్వం లేకపోవడంతో ఇవి యధేచ్ఛగా కొనసాగుతున్నాయి.

గోవులను కబేళాలకు పంపి చంపడం, గోమాంసం తినడం నిషేధించబడ్డాయి. అలాంటి అవకాశం కల్పించకుండా ఉండడానికి కూడా అనేక మార్గాలు మనముందు ఉన్నాయి. గ్రామాలలో విరివిగా గోసంరక్షణ శాలలు ఏర్పాటు చేయాలి. వీటి నిర్వహణ కొరకు సగం మొత్తాన్ని ఆయా స్థానిక సంస్థలు ఏర్పాటు చేస్తే మిగిలిన సగాన్ని ఆయా సంరక్షణ సంఘాలు స్వయంగా సమకూర్చుకోవాలి. వీటికి అందించే విరాళాలపై ఆదాయపు పన్ను శాఖ మినహాయింపు ఇవ్వాలి. ఇటువంటి సంఘాలకు ప్రధాన కార్యాలయాలు నగరాలలో ఉంటూ విరాళాలను ఖర్చు చేసే వ్యక్తుల వ్యవహార శైలిపై అదుపు కలిగి ఉండాలి. సాధ్యమైనంత వరకు పశు సంరక్షణకు వస్తురూపేణా విరాళాలు లభించాలి. గోసంరక్షణ శాలలలో నిరంతర కెమేరా పర్యవేక్షణ ఉండాలి. గోవులను విక్రయించదలిచిన వారు వాటిని ఈ సంరక్షణ శాలలకు మాత్రమే విక్రయించాలని నిబంధన విధించాలి. అమ్ముకునే వారికి ఇటువంటి గోవుల విక్రయంపై నిర్దిష్టమైన సొమ్ము ఇచ్చేలా తక్షణ చెల్లింపు విధానం ఉండాలి. గోవులను విక్రయించాలనుకున్నప్పుడు తమ విక్రయాభిమతాన్ని తెలియజేసే యాప్‌లు కూడా ఏర్పాటు చేయాలి. ఇటువంటి గోవులను కొనేందుకు అంతర్జాతీయంగా వెబ్‌సైట్‌లలో విరాళాల వసూలు అకౌంట్లు తెరవాలి. సాధారణంగా కబేళాలవారు ఒక్కొక్క గోవుకు రూ. 500 నుండి రూ. 1000 వరకు చెల్లిస్తారు. గోసంరక్షణ శాలల నిర్వాహకులు ఒక్కొక్క ఆవుకు వెయ్యి రూపాయల వంతున చెల్లిస్తే పశుపాలకులు ఎవ్వరూ వాటిని కబేళాలకు విక్రయించరు. అదేవిధంగా గోవుల ఆచూకీ కొరకై ఆధార్‌కార్డు వంటి రికార్డు కూడా అందుబాటులో ఉండాలి. ప్రతీ గ్రామ పంచాయితీలోను ఎవరెవరు ఎన్నెన్ని గోవులను కలిగి ఉన్నారో ఎప్పటికప్పుడు తాజా రికార్డు ఉండాలి. గోవుల జనన మరణాలకు కూడా నమోదు విధానం ఉండాలి. విక్రయం విషయంలో కూడా పంచాయితీకి విధిగా తెలియజేయాలి. ఇది స్వల్ప విషయంగా భావించకుండా ప్రాధాన్యతాంశంగా తీసుకుంటే సులభంగానే పని జరుగుతుంది. గోవులు సురక్షితంగా జీవిస్తూ సహజ మరణం పొందే అవకాశం కల్పించినప్పుడే మానవజీవితం ధన్యమవుతుంది.


దక్షిణ మధ్య రైల్వే

దక్షిణ మధ్య రైల్వే యొక్క టెండరు నోటీసులలోని వివరములు మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in నందు కూడా చూడవచ్చును.

నెం: బి/ఎస్‌జి/డివై.సిఎస్‌టిఇ/జిఎస్/ ఇ-5/2023-24 తేది : 12.06.2023 PUB/0636

భారత రాష్ట్రపతి తరపున దిగువ సంతకం చేసిన వారు దిగువ తెలిపిన పనుల కొరకు తేది : 05.07.2023 గం. 15.30 ల వరకు ఈ-టెండర్లు ఆహ్వానించుచున్నారు.

వ.సం.:-1. పని పేరు:- బి-ఎస్‌జి-జిఎస్-05-2023-24, తేది : 12.06.2023 విజయవాడ డివిజన్: గతి శక్తి : సిగ్నల్ మరియు టెలికాం : సామర్లకోట జంక్షన్ స్టేషన్ : (1) సామర్లకోట జంక్షన్ సౌత్ క్యాబిన్ వద్ద కోడల్ లైఫ్ కంప్లీటెడ్ ప్యానల్ ఇంటర్ లాకింగ్ ఇండోర్ & అవుట్ డోర్ గేర్లు రెండునూ డిస్ట్రిబ్యూటెడ్ ఈఐతో సహా రీప్లేస్‌మెంట్ చేయుట. (2) ఎస్‌ఎల్‌ఓ వద్ద ఎస్‌ఎల్‌ఓ నుండి సీఓఏ డైరెక్షన్‌లోనూ మరియు సర్పంగపల్లి స్టేషన్ దిశలోనూ అప్ అండ్ డౌన్ ట్రైన్లను పంపించు రిసెప్షన్ కొరకు అదనపు క్రాస్ ఓవర్ ప్రతిపాదిత ఏర్పాటు. (1) ఏజీ-కం- కండీషన్ విధానంలో ప్రస్తుతం ఉన్న అవుట్ డోర్ మరియు ఇండోర్ సిగ్నలింగ్ గేర్లతో గల ప్యానల్ ఇంటర్ లాకింగ్‌ను కొత్త ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్ సిస్టంతో రీప్లేస్‌మెంట్ చేయు సందర్భంలో సిగ్నలింగ్ ఏర్పాట్లు. (2) ఎస్‌సి రైల్వే యొక్క విజయవాడ డివిజన్‌లో 720 మీటర్ల పొడవున ప్రతిపాదిత మెయిన్‌లైన్లు మరియు లూప్‌లైన్ల పొడిగింపు. టెండరు విలువ రూ-పై:- రూ. 11,71,05,259.37/-, ధరావత్తు రూ:- 7,35,500.00/- సిటిబి రూ:- లేదు, పూర్తి చేయు కాలము:- 18 నెలలు.

వివరణ: మూసివేయు తేదీ మరియు సమయం :- గం. 15.30 లకు., తేది : 05.07.2023

1) కొత్తాహిక టెండరుదారులు పై టెండరు మూసివేయు తేదీకి ముందు రోజు వరకు ఏవైనా సవరణలు/ మార్పులు చేయబడేవేమో తెలుసుకొనుట కొరకు మా వెబ్‌సైట్ "www.ireps.gov.in" సందర్శించవలసిందిగా సూచించడమైనది

డిప్యూటీ. చీఫ్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్/ గతి శక్తి, విజయవాడ

బహిరంగ ఈ-టెండరు నోటీస్ నెం. బి/ఇ.ఇజిఎస్/ 05/2023-24 తేది. 12.06.2023 PUB/0637

భారత రాష్ట్రపతి తరపున దిగువ సంతకం చేసిన వారు దిగువ తెలిపిన పని కొరకు ఆయా పనులకు ఎదురుగా సూచించిన తేదీలలో గం. 15.00 వరకు ఈ-టెండర్లు ఆహ్వానిస్తున్నారు.

1. బి/ఇ.29/I/ఇజిఎస్/13/23-24 పని పేరు:- బిజెడ్ఎ డివిజన్- విజయవాడ డివిజన్ యందు అమృత్ భారత్ స్టేషన్ పథకం క్రింద హెవీ డ్యూటీ రివర్సిబుల్ టైప్ పాసింజర్ ఎస్కలేటర్లు-15 నెంబర్లు రెండు సంవత్సరముల వారంటీతో సహా డిజైన్, తయారీ సరఫరా రవాణా, అమరిక, పరీక్షించుట, పనిచేయించుట మరియు నిర్వహణ. పూర్తి చేయు కాలము:- 09 నెలలు, టెండరు విలువ:- రూ. 12,83,67,165/-, ధరావత్తు/బిడ్ సెక్యూరిటీ (రూ.):- రూ. 7,91,800/-, టెండరు డాక్యుమెంట్ వెల:- లేదు, టెండరు మూసివేయు తేది:- 06.07.2023

1) కొత్తాహిక టెండరుదారులు పై టెండరు మూసివేయు తేదీకి ముందు రోజు వరకు ఏవైనా సవరణలు/ మార్పులు చేయబడేవేమో తెలుసుకొనుట కొరకు మా వెబ్‌సైట్ "www.ireps.gov.in" సందర్శించవలసిందిగా సూచించడమైనది

A0906 డివిజనల్ రైల్వే మేనేజర్ (ఎలక్ట్రికల్), విజయవాడ

టెండరు షరతులు/వివరాలు/ నిబంధనలు, మరియు టెండరు డాక్యుమెంట్లు డౌన్‌లోడింగ్ కొరకు వెబ్‌సైట్ http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in ను సందర్శించండి.


# ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని జరుపుకున్న ఆర్ఐఎన్ఎల్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆర్ఐఎన్ఎల్‌కి చెందిన విశాఖ స్టీల్ జనరల్ హాస్పిటల్‌లో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవ వేడుకల్లో భాగంగా రక్తదానానికి సంబంధించిన వివిధ అంశాలను తెలియజేసే వివిధ స్టాల్స్ ద్వారా రక్తదానంపై విద్యా విషయక ఎగ్జిబిషన్, బ్లడ్ గ్రూప్ టెస్టింగ్, రక్తదానంపై అవగాహన కల్పించే విద్యా సామగ్రి ప్రదర్శనను ప్రదర్శించారు. ఉద్యోగులు మరియు ప్రజల కోసం కొత్త రక్తదాతల నమోదు కూడా జరిగింది. దాదాపు 500 మంది స్టాల్స్‌ను సందర్శించి అన్ని ఎగ్జిబిట్‌లను తిలకించారు.

ఆర్ఐఎన్ఎల్‌లోని వీఎస్‌జీహెచ్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన అధికారిక కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ ఆర్ఐఎన్ఎల్ కమాండెంట్ అత్తార్ మహమ్మద్ హనీఫ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ కె.హెచ్.ప్రకాష్, సిజిఎం (ఎం&హెచ్ఎస్), డా. ఎ.పి. నవీన్ కుమార్, జీఎం, డా.జె.ఎన్.సారంగి జిఎం (మెడ్), డాక్టర్ ఎ. శాంతి ప్రియ డిజిఎం (మెడ్-పాత్) గౌరవ అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆర్ఐఎన్ఎల్ సీఐఎస్ఎఫ్ కమాండెంట్ అత్తార్ మహ్మద్ హనీఫ్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని, మరింత మంది ఉద్యోగులను, ప్రజలను రక్తదాతలుగా తీర్చిదిద్దాలని, ఇతరులను కూడా ఈ ఉదాత్తమైన రక్త దానం చేయడానికి ముందుకు వచ్చేలా ప్రోత్సహించాలని సూచించారు. వీఎస్‌జీహెచ్‌లో ఇంత ముఖ్యమైన కార్యక్రమాన్ని నిర్వహించినందుకు వీఎస్‌జీహెచ్ వైద్యులను, సంబంధిత వారందరికీ ఆయన అభినందనలు తెలిపారు.

విఎస్‌జిహెచ్ చీఫ్ జనరల్ మేనేజర్ డాక్టర్ కెహెచ్ ప్రకాష్, హెచ్ఓడి, మెడికల్, ఆర్ఐఎన్ఎల్ మాట్లాడుతూ ఉద్యోగులకు మరియు వారిపై ఆధారపడిన వారికి నాణ్యమైన వైద్య సేవలను అందించడంలో విఎస్‌జిహెచ్ ఎల్లవేళలా ముందంజలో ఉందని అన్నారు. ఆర్ఐఎన్ఎల్ బ్లడ్ సెంటర్ నిరుపేదలకు అద్భుతమైన సేవలందిస్తున్నదని తెలిపారు.

డాక్టర్ ఎపి నవీన్ కుమార్, ఇన్‌ఛార్జ్ మెడికల్ లాబొరేటరీ తన స్పీచ్‌లో విఎస్‌జిహెచ్‌లో విద్యా కార్యకలాపాల ఆవశ్యకతను నొక్కి చెప్పారు.

ఇన్‌ఛార్జ్ మెడికల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ జెఎన్ సారంగి తన సందేశంలో, విఎస్‌జిహెచ్ సేవలను విస్తరించడంలో పనితీరును మెరుగుపరచడంలో పరిపాలన యొక్క నిబద్ధతను నొక్కి వివరించారు. అంతేకాకుండా రక్తదానంపై ఈ ముఖ్యమైన కార్యక్రమాన్ని నిర్వహించినందుకు నిర్వాహకులను ఆయన అభినందించారు.

ఇన్‌ఛార్జ్ బ్లడ్ సెంటర్ డాక్టర్ శాంతి ప్రియ, ఆర్ఐఎన్ఎల్ రక్త కేంద్రం యొక్క కార్యకలాపాలను మరియు రక్త కేంద్రం యొక్క ఇటీవలి అప్-గ్రేడేషన్ గురించి విపులంగా వివరాలను తెలియపరిచారు.

ఇటీవల అప్‌డేట్ చేయబడిన బ్లడ్ డోనర్ డేటాబేస్ ముఖ్య అతిథి మరియు ఇతర ప్రముఖులచే విడుదల చేయబడింది, ఇందులో దాదాపు 6000 రక్త దాతల వివరాలు సిద్ధంగా ఉన్నాయి.

ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, పారామెడికల్ సిబ్బంది, పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

# మెరుగైన వైద్యం కోసం సంజీవని నిధిని విడుదల చేయించిన మంత్రి విడదల



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** చిన్న వయసు నుండి డయాబెటిస్ వ్యాధితో బాధపడుతున్న రావాడ తరుణ్ కుమార్‌కు మెరుగైన వైద్యం కోసం మానవతా దృక్పథంతో జిల్లా ఇన్‌చర్జ్ మరియు ఆరోగ్యం కుటుంబ సంక్షేమం, వైద్య విద్య శాఖ మంత్రి విడదల రజని స్పందిస్తూ ఆర్థిక భరోసా కల్పించారు. గత ఆదివారం తేదీ10-6-2023న నగరంలో యూపిహెచ్‌సి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రిని సహాయం నిమిత్తం కొత్తవలస, కల్లేపల్లిరేగ గ్రామానికి చెందిన రావాడ రాము (తల్లి) తన కుమారుడు రావాడ తరుణ్ కుమార్ చిన్న వయసు నుండి డయాబెటిస్ వ్యాధితో బాధపడుతున్నాడని మంత్రికి వివరించగా, మంత్రి విడదల రజని మానవతా దృక్పథంతో స్పందించి తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జునను ఆదేశించారు.

25వేల రూపాయలు ఆర్థిక సహాయం :

మంత్రి విడదల రజని ఆదేశాలతో గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున సంజీవని నిధి క్రింద 25వేల రూపాయలు చెక్కును విఎమ్ఆర్డిఎ కార్యాలయంలో తమ చాంబర్‌లో రావాడ తరుణ్ కుమార్‌కు అందజేశారు.

భవిష్యత్తులో మెరుగైన వైద్యం కోసం ఎటువంటి సహాయం కావాలన్నా తమను సంప్రదించాలని, సహాయం చేయుటకు కృషి చేస్తామన్నారు.

# సరికొత్త వ్యూహాలతో బాల్య వివాహాల నిర్మూలన



**విజయనగరం :** బాల్య వివాహాల నిర్మూలనకు సరికొత్త వ్యూహాలతో ముందడుగు వేయాలని యూనిసెఫ్ కన్సల్టెంట్లు జోన్స్, కృష్ణవేణి పిలుపునిచ్చారు. అందుకు అనుసరించాల్సిన మార్గాల గురించి వివరించారు. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశాల మేరకు గత రెండు రోజులుగా డి.ఆర్.డి.ఎ మీటింగ్ హాల్లో యూనిసెఫ్ -మహిళా శిశు సంక్షేమ సాధికారత శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'బాలల సాధికారత -బాల్య వివాహాల నిర్మూలన' అనే అంశంపై ఏర్పాటు చేసిన రెండు రోజుల ముగింపు శిక్షణ గురువారంతో ముగిసింది.

ఈ శిక్షణ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ శాఖల సమన్వయంతో బాల్య వివాహల నిర్మూలనకు ఉక్కు పాదం మోపాలని పిలుపునిచ్చారు. బాల్య వివాహాలు జరిగితే పోలీసులు కేసులు నమోదు చేయాలన్నారు. ఎవరి నుంచి ఫిర్యాదు రాకపోయినా కేసులు నమోదు చేయవచ్చున్నారు.

ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో బాల్య వివాహల నిరోధానికి చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. బాలలతో పనిచేసే సంస్థలు, సంఘాలు, అధికారులు, అనధికారులు అందరి భాగస్వామ్యంతో బాల్య వివాహాల రహిత సమాజంగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలన్నారు. జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ హిమబిందు మాట్లాడుతూ బాలల్లో మార్పు తీసుకురావాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ పథక సంచాలకులు శాంత కుమారి, దిశ పోలీస్ స్టేషన్ అధికారులు, తహశీల్దార్లు, విద్యా శాఖ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి అల్లు సత్యనారాయణ, సామాజిక పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ జిల్లా సమన్వయ అధికారి బి. రామకృష్ణ, లైజన్ అధికారి విద్య, కోఆర్డినేటర్ లక్ష్మి కుమారి, జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు సుధారాణి పట్నాయక్, భవాని, సిబ్బంది యాల్ల నాగరాజు, వెంకటరావు, ప్రాజెక్ట్ అధికారులు, పర్యవేక్షణ అధికారులు పాల్గొన్నారు.

# కోచింగ్ సెంటర్‌లో అగ్నిప్రమాదం.. ప్రాణాల కోసం విద్యార్థుల పోరాటం!



ఢిల్లీ: దేశ రాజధానిలో ఘోర అగ్నిప్రమాద ఘటన చోటు చేసుకుంది. ఓ కోచింగ్ సెంటర్‌లో గురువారం ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. మంటలు ఒక్కసారిగా ఎగసిపడటంతో కోచింగ్ సెంటర్‌లో ఉన్న విద్యార్థులు ప్రాణాలను అరచేతిలో పట్టుకుని కిటికీల నుంచి తాడు సాయంతో కిందకు దిగారు. కాగా దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

వివరాల ప్రకారం ఢిల్లీలోని ముఖర్జీ నగర్ ప్రాంతంలో ఉన్న భవనం పై అంతుస్తులో ఉన్న ఓ కోచింగ్ సెంటర్‌లో గురువారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో అగ్నిప్రమాదం జరగడంతో మంటలు వ్యాపించాయి. ఈ క్రమంలో ప్రాణాలతో బయటపడేందుకు కోచింగ్ సెంటర్ బిల్డింగ్ కిటికీల నుంచి విద్యార్థులు తాడు సాయంతో కిందికి దూకారు. ఇక ఈ ప్రమాదం ఘటనలో నలుగురు విద్యార్థులు గాయపడ్డారు. అయితే అగ్ని ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటాన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

ఘటనా ప్రాంతానికి 11 అగ్నిమాపక యంత్రాలు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చామని అధికారులు తెలిపారు. కోచింగ్ సెంటర్ నుంచి విద్యార్థులను బయటకు రప్పించామని ఢిల్లీ ఫైర్ సేఫ్టీ చీఫ్ వెల్లడించారు. కాగా అగ్నిప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉందని అధికారులు స్పష్టం చేశారు.

# శ్రీను కుటుంబానికి అండగా నిలిచిన స్నేహితులు



పరవాడ, (విశాఖ సమాచారమ్): అనకాపల్లి జిల్లా మండల కేంద్రమైన పరవాడ గ్రామానికి చెందిన ఫోటోగ్రాఫర్ కుబిరెడ్డి శ్రీను చిన్న వయసులోనే కిడ్నీ సంబంధిత వ్యాధితో ఇటీవల మరణించారు. వారి స్నేహితులు బొంకుల దిబ్బ మరియు నూకాంబిక యూత్ సభ్యులు కలిపి 88 వేల రూపాయలు, మరిడిమాంబ యూత్ సభ్యులు 22 వేల రూపాయలు, ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ సభ్యులు 25వేల రూపాయలు మొత్తం 1,33,000 రూపాయలను రాష్ట్ర సీఈసీ సభ్యులు పైల శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు వారి కుటుంబ సభ్యులకు ఈ మొత్తం నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద చెరువు ఆయకట్టుదారుల సంఘం అధ్యక్షుడు రెడ్డి శ్రీను, వైకాపా నాయకులు పైల హరీష్, వర్రీ హరి, పైల పైడి నాయుడు, ఫోటోగ్రాఫర్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వందే భారత్ రైలులో వర్షపు నీరు లీక్‌తోప్రయాణికులకు ఇక్కట్లు!



**హైదరాబాద్:** కేంద్రం ఎంతో ప్రతిష్టాత్మకంగా దేశవ్యాప్తంగా వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే, ఈ రైళ్లు ఇప్పటికే పలు ప్రమాదాల్లో దెబ్బతిన్న విషయం తెలిసిందే. అంతకుముందు జంతువులు ఢీకొనడంతో రైలు ముందు భాగం దెబ్బతిన్న దృశ్యాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. ఇక తాజాగా వర్షాల నేపథ్యంలో రైలులో వర్షపు నీరు కారడంతో ఆ నీళ్లు బోగీలోకి ప్రవేశించాయి. దీంతో వర్షపు నీటిని సిబ్బంది టబ్స్‌తో పట్టుకుంటున్నారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

వివరాల ప్రకారం ఈ ఏడాది ఏప్రిల్ 25వ తేదీన కేంద్రం కేరళకు వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను కేటాయించింది. ప్రధాని నరేంద్ర మోదీ కేరళ రాజధాని తిరువనంతపురం సెంట్రల్ స్టేషన్‌లో స్వయంగా పచ్చజెండా ఊపి ఈ రైలును ప్రారంభించారు. తిరువనంతపురం నుంచి కాసర్‌గోడ్ మధ్య రాకపోకలు సాగించే రైలు ఇది. అయితే ఈ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో డొల్లతనం బయటపడింది. వర్షాల కారణంగా వర్షపు నీరు రైలు బోగీల్లో కారింది.

కాగా, భారీ వర్షాలకు ఈ రైలు చూరు లీక్ కావడంతో బోగీల్లోకి వర్షపు నీరు ప్రవేశించింది. దీంతో వర్షపు నీటిని సిబ్బంది టబ్స్‌తో పట్టుకున్నారు. దీనికి సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇక, ఈ వీడియోను కేరళ కాంగ్రెస్ తన అధికారిక ట్విట్టర్ అకౌంట్‌లో పోస్ట్ చేసింది. దీనిపై సెటైరికల్ కామెంట్స్ చేసింది. వందే భారత్‌లో ప్రయణికులకు గొడుగులు సప్లై చేసే పరిస్థితి ఏర్పడిందంటూ కామెంట్స్ పెట్టింది.

# రక్తప్రసరణ వృద్ధికి తోడ్పడే ఆహారం



ఈ రోజుల్లో రక్త ప్రసరణలో సమస్యలు ఎక్కువ అయ్యాయి. అధిక బరువు, స్మోకింగ్, డయాబెటిస్, రేనాడ్స్ వంటి అనారోగ్యాల కారణంగా.. రక్త ప్రసరణ సక్రమంగా జరగట్లేదు. రక్తప్రసరణ సరిగా లేకపోతే ఎన్నో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. రక్తం ప్రసరణ సరిగ్గా జరగక పోతే.. కండరాల తిమ్మిరి, నొప్పి, జీర్ణ సమస్యలు, చేతులు, కాళ్లలో తిమ్మిరి, చల్లబటం వంటి సమస్యలు ఎదురవుతాయి. దీని కారణంగా గుండె సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉంది. రక్తప్రసరణ సమస్య తీవ్రం అయితే.. మందులతో నయం చేయవచ్చు. శరీరంలో బ్లడ్ సర్క్యులేషన్‌ను మెరుగుపరచడానికి కొన్ని ఆహార పదార్థాలు, జీవనశైలి మార్పులు సహాయపడతాయి. అవేంటో తెలుసుకోవాలంటే..

**ఫ్లేవనాయిడ్స్ రిచ్ ఫుడ్...** ఉల్లిపాయలు, దానిమ్మ వంటి ఫ్లేవనాయిడ్స్ రిచ్ ఫుడ్స్ రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. ఉల్లిపాయలు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ధమనులను విస్తరించి.. రక్తప్రసరణ మెరుగ్గా జరిగేలా తోడ్పడుతుంది. రక్తప్రసరణ సమస్యలతో బాధపడేవారు దానిమ్మ రసం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. దీనిలో పాలీఫెనాల్స్, సూక్ష్మపోషకాలు, శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్స్ ఉంటాయి. ఇవి ధమనులలో అడ్డంకిని తొలగిస్తాయి. ధమనులు మృదువుగా ఉంచడానికి, రక్త ప్రవాహాన్ని అదుపులో ఉంచడానికి సహాయపడతాయి. అంతేకాకుండా ధమనులు మందంగా, గట్టిపడకుండా రక్షిస్తుంది.

**నైట్రిక్ ఆక్సైడ్ రిచ్ ఫుడ్స్..** నైట్రిక్ ఆక్సైడ్ రక్తప్రసరణకు సహాయపడుతుంది. ఎర్ర మిరపకాయలు, వెల్లుల్లి, దాల్చినచెక్క, బీట్‌రూట్, ఆకుకూరల్లో నైట్రిక్ ఆక్సైడ్ సమృద్ధిగా ఉంటుంది. పసుపులోని కర్క్యుమిన్ రక్త ప్రసరణను మెరుగుపరుస్తుందని నిపుణులు చెబుతున్నారు.

**విటమిన్ సి..** విటమిన్ సి పుష్కలంగా ఉండే.. కమల, స్వీట్ లెమన్, నిమ్మ రక్తనాళాలను విస్తరించడానికి సహాయపడుతుంది. విటమిన్ సి శరీరంలోని మంటను తగ్గిస్తుంది, రక్త ప్రవాహాన్ని మెరుగుపరుస్తుంది. ధమనులలో రక్తపోటును, దృఢత్వాన్ని తగ్గించడానికి తోడ్పడుతుంది. మీ డైట్‌లో పుచ్చకాయ ఎక్కువగా తీసుకున్నా.. రక్త ప్రసరణ మెరుగ్గా జరుగుతుంది, దీనిలో లైకోపీన్ రక్త ప్రసరణను మెరుగుపరిచే యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది.

**నట్స్..** బాదం, వాల్‌నట్స్ శరీరంలో మంటను, ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. తద్వారా రక్త ప్రవాహం మెరుగుపడుతుంది. వాల్‌నట్స్‌లోని ఎల్-అర్జినైన్ రక్తప్రసరణకు మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు.

**ఒమేగా -3 కొవ్వు ఫ్యాటీ యాసిడ్స్..** ఒమేగా - 3 ఫ్యాటీ యాసిడ్స్ అథెరోస్క్లెరోసిస్‌ను తగ్గిస్తుంది, రక్తప్రసరణను మెరుగుపరుస్తుంది. ఒమేగా -3 కొవ్వు ఫ్యాటీ యాసిడ్స్ గుండె పోటు, స్ట్రోక్ ముప్పును తగ్గిస్తాయి. సాల్మన్, గుమ్మడి, నువ్వులు, పొద్దుతిరుగుడు, అవిసె గింజల్లో ఒమేగా - 3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి.

**టమాటా, బెర్రీస్..** టమాటా, బెర్రీలు యాంజియోటెన్సిన్-కన్వర్టింగ్ ఎంజైమ్‌ను నిరోధిస్తాయి, ఇది హైపర్‌టెన్షన్ తగ్గిస్తుంది, రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. టామాటాలో ఉండే కార్డియోవాస్క్యులార్ సమస్యలు రాకుండా రక్షిస్తుంది. దీనిలోని విటమిన్ కె.. రక్తస్రావం, రక్తం గడ్డకట్టడాన్ని అదుపులో ఉంచుతుంది.

# కాల్చిన వెల్లుల్లి తింటే మధుమేహం కంట్రోల్‌లో ఉంటుంది



ప్రస్తుతం బీపీ, మధుమేహం లేని ఇళ్లు దొరకడం కష్టం. ఎంతలా అంటే ఈ 2 అంటు వ్యాధులు ప్రజలను అతలాకుతలం చేసేస్తున్నాయి. నూటికి 70% మందికి మధుమేహం పెరగడానికి ఆహార శైలి, జీవనశైలిలో వచ్చిన మార్పులే కారణమని చెప్పవచ్చు.

అయితే తగిన జాగ్రత్తలు పాటించి సరైన ఆహారం తీసుకుంటే ఈ మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవచ్చు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో వెల్లుల్లి కీలక పాత్ర పోషిస్తుంది. అయితే వెల్లుల్లిని ఎంత తీసుకోవాలి, ఎలా తీసుకోవాలి అనేది ముఖ్యం.

మధుమేహం నయం చేయలేని వ్యాధి. ఈ వ్యాధికి ఇంకా మందు లేదు. కానీ కొన్ని ఆయుర్వేద మరియు ఇంటి నివారణలతో రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించవచ్చు.

ఇలాంటి పరిస్థితుల్లో మధుమేహ వ్యాధిగ్రస్తులు తినే ఆహారం విషయంలో మరింత జాగ్రత్త వహించడం మంచిది. వెల్లుల్లిని క్రమం తప్పకుండా తింటే షుగర్ అదుపులో ఉంటుందని కొందరు అంటున్నారు. దానికి సంబంధించిన పూర్తి సమాచారం ఈ కథనంలో తెలుసుకుందాం..

మధుమేహ వ్యాధిగ్రస్తులు వెల్లుల్లి తినడం వారి ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ప్రక్రియ. వెల్లుల్లిలో పోషకాలు పుష్కలంగా ఉన్నా యి. వెల్లుల్లిలో కార్బోహైడ్రేట్లు, కొవ్వులు, ప్రోటీన్లు, విటమిన్లు మరియు ఖనిజాలు, విటమిన్ బి1, విటమిన్ బి2, విటమిన్ బి3, విటమిన్ బి5, విటమిన్ బి6, విటమిన్ బి9, విటమిన్ సి, కాల్షియం, ఇనుము, మెగ్నీషియం, మాంగనీస్, ఫాస్పరస్, పోషకాలు. ఇందులో పొటాషియం, సోడియం, జింక్ మరియు సెలీనియం కూడా ఉన్నాయి.

వెల్లుల్లిలో యాంటీ బ్యాక్టీరియల్ మరియు యాంటీ ఫంగల్ లక్షణాలు ఉన్నాయి. ఇందులో జింక్, ఫాస్పరస్, సెలీనియం, కాల్షియం మరియు ఐరన్ వంటి అనేక ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. ఇందులో 'అల్లిసిన్' అనే అద్భుతమైన సల్ఫరస్ సమ్మేళనం ఉంటుంది. వెల్లుల్లి దాని ఘాటైన రుచి మరియు వాసనకు బాధ్యత వహిస్తుంది.

మధుమేహానికి వెల్లుల్లి దివ్యౌషధం - వెల్లుల్లి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో మాత్రమే కాకుండా, టైప్ 2 డయాబెటిస్‌ను నివారించడంలో కూడా చురుకైన పాత్ర పోషిస్తుందని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి.

వెల్లుల్లిలో జింక్ మరియు సహజ యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి, ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గిస్తాయి. కార్బోహైడ్రేట్లు తక్షణ జీవక్రియను పెంచుతాయి. కార్బోహైడ్రేట్లు నేరుగా రక్తంలో చక్కెర పెరుగుదలకు కారణమవుతాయి మరియు వెల్లుల్లి తినడం దానిని నియంత్రించడంలో సహాయపడుతుంది.

అయినప్పటికీ, అమైనో ఆమ్లం హోమోసిస్టీన్ అనే సమ్మేళనం మధుమేహానికి ప్రమాద కారకం. వెల్లుల్లిని దీర్ఘకాలం తీసుకోవడం వల్ల శరీరంలో ఈ సమ్మేళనం తగ్గుతుంది. కాబట్టి వెల్లుల్లిని జాగ్రత్తగా తినాలని నిపుణులు చెబుతున్నారు.

మధుమేహ రోగులు వెల్లుల్లిని ఎలా ఉపయోగించాలి? రక్తంలో చక్కెరను అదుపులో ఉంచడానికి, మధుమేహ రోగులు ఉదయం ఖాళీ కడుపుతో పచ్చి వెల్లుల్లిని తినవచ్చు. మరిన్ని ప్రయోజనాల కోసం మీరు కాల్చిన వెల్లుల్లిని కూడా తినవచ్చు. వెల్లుల్లిని వేయించడానికి, పాన్‌లో కొద్దిగా ఆవాల నూనె తీసుకొని వేడి చేయండి. నూనె వేడి అయ్యాక అందులో వెల్లుల్లి రెబ్బలు వేసి బాగా



వేయించాలి. దాని రంగు లేత గోధుమ రంగులోకి మారడం ప్రారంభించినప్పుడు, దానిలో నల్ల ఉప్పు కలపండి. మీకు కావాలంటే, మీరు మైక్రోవేవ్‌లో వెల్లుల్లిని కూడా కాల్చవచ్చు.

కాల్చిన వెల్లుల్లి తినడం వల్ల అనేక ప్రయోజనాలు కాల్చిన వెల్లుల్లిని కూడా ఖాళీ కడుపుతో తినవచ్చు మరియు ఏదైనా తిన్న కొంత సమయం తర్వాత తినవచ్చు. వెల్లుల్లి తినడం వల్ల గ్యాస్, మలబద్ధకం, పొత్తికడుపు నొప్పి మరియు అసిడిటీ వంటి అన్ని కడుపు సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. దీన్ని రోజువారీ తీసుకోవడం కూడా బరువు తగ్గడంలో మీకు చాలా సహాయపడుతుంది.

# వేసవి అలసట దూరం చేసే సూపర్ ఎనర్జీ డ్రింక్స్



వేసవి కాలంలో కాసేపు అలా ఎండలోకి వెళ్లొస్తే ఎనర్జీ మొత్తం పోతుంది. అలసట, నీరసం ఆవహించేస్తాయి. డీహైడ్రేషన్ వల్ల కూడా అలసట, నీరసం, తలనొప్పి లాంటి సమస్యలు తలెత్తుతాయి.

మీరు కూడా ఈ వేసవికాలంలో నీరసంగా మారిపోతే, శక్తి మొత్తం కోల్పోతే ఇంట్లోనే ఈ ఎనర్జీ డ్రింకులు తయారు చేసుకుని తాగండి. ఆరోగ్యంగా ఉండటంతో పాటు ఈ వేసవికాలంలో ఫుల్ ఎనర్జీతో ఉంటారు.

ఎండాకాలంలో ఆవహించే నీరసాన్ని తరిమికొట్టి, ఎనర్జీగా ఉంచే పానీయాలను ఇంట్లోనే ఎలా తయారు చేసుకోవాలి, వాటితో లాభాలేమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

1. పుచ్చకాయ, తులసి రసం : పుచ్చకాయ నుండి గింజలు తొలగించి ఒక గిన్నెలో తీసోవాలి. అందులో తులసి ఆకులు, పుదీనా ఆకులు, కొద్దిగా నిమ్మరసం వేసి ఆకులన్నీ మెత్తగా నూరి పుచ్చకాయ రసంలో కలిసిపోయే వరకు గ్రైండ్ చేసుకుంటే పుచ్చకాయ, తులసి రసం సిద్ధమైనట్లే.

ఈ పానీయం తాగడం వల్ల యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు శరీరానికి అందుతాయి. తక్షణ ఎనర్జీ అందిస్తాయి. పుచ్చకాయ, తులసి, పుదీనాలోని పోషకాలు రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తాయి. తులసి ఇన్ఫెక్షన్లతో పోరాడటంలో సహాయపడుతుంది.

2. బాదం తాండై: కొన్ని పాలను గిన్నెలో తీసుకుని మరిగించాలి. అందులో 2 టేబుల్ స్పూన్ల యాలకుల పొడి, 2 టేబుల్ స్పూన్ల గసగసాలు, 5 నల్ల మిరియాలు, 1 టేబుల్ స్పూన్ వేయించిన సన్ ఫ్లవర్ సీడ్ పౌడర్, కొన్ని ఖర్జూరాలు, కొద్దిగా కుంకుమ పువ్వు వేసి పాలు చిక్కబడే వరకు మరిగించుకోవాలి. తర్వాత వడపోసుకుని పిస్తా, బాదంతో గార్నిష్ చేసుకుని తాగొచ్చు.

ఈ పానీయం తాగడం ద్వారా శరీరానికి మెగ్నీషియం సహా ఇతర పోషకాలు అందుతాయి. దీని వల్ల తక్షణ శక్తి వస్తుంది.

3. క్యారెట్, బీట్‌రూట్ క్యారెట్: బీట్ రూట్‌లను సన్నగా, పొడవాటి ముక్కలుగా కట్ చేసిన గ్రైండ్ చెయ్యాలి. తర్వాత సిరామిక్ జార్ లో వేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని మస్లిన్ క్లాత్ లేదా మూతతో కప్పి 3-4 రోజుల పాటు ఎండలో ఉంచాలి. కంజి పుల్లగా మారే వరకు చెక్క చెంచాతో రోజూ కదిలిస్తూ ఉండాలి. ఇది పుల్లగా మారిన తర్వాత తాగడానికి సిద్ధమైనట్లు.

దీని వల్ల జీర్ణవ్యవస్థ బలోపేతం అవుతుంది. రోగనిరోధక శక్తి మెరుగుపడుతుంది. కంజిలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఈ పానీయం బరువు తగ్గడానికి, చర్మ సంరక్షణకు కూడా ప్రభావవంతంగా ఉంటుంది.

4. తేనె, ఉసిరి పానీయం: ముందుగా ఉసిరి కాయలను దంచి గుడ్డలో కట్టి రసాన్ని తీయాలి. ఆ మిశ్రమంలో 3 టేబుల్ స్పూన్ల తేనె వేసుకుని కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ఎండాకాలంలో తీసుకుంటే తక్షణ శక్తి వస్తుంది. తేనె ఇష్టం లేని వాళ్లు, ఉసిరికాయల రసాన్ని నీటిలో కలుపుకొని తాగొచ్చు.

తేనె, ఉసిరిలో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. వీటి వాడకం శరీరానికే కాకుండా చర్మానికి, జుట్టుకు కూడా మేలు చేస్తుంది. ఉసిరి, తేనెతో చేసిన ఈ ఎనర్జీ డ్రింక్ రోగనిరోధక శక్తికి మాత్రమే కాకుండా, దీర్ఘాయువును ప్రోత్సహిస్తుంది.

# జుట్టు మరియు ముఖం మెరుపుకు వంటగదిలోని మెంతులు చాలు!



ఎలాంటి కెమికల్ ప్రొడక్ట్స్ వాడకుండా మన ఇంటి కిచెన్ లో లభించే మెంతులు మాత్రమే వాడటం ద్వారా మీ ముఖం మరియు జుట్టు నిగనిగలాడేలా ఎలా ఉంచుకోవాలో ఈ పోస్ట్ ద్వారా తెలుసుకోవచ్చు.

నేటి తరంలో స్త్రీ పురుషులు ఇద్దరూ తమను తాము అందంగా ఉంచుకోవడం గురించి ఆలోచిస్తూ కాలం గడుపుతున్నారు. అందం విషయానికి వస్తే, అందమైన ప్రకాశవంతమైన ముఖం మరియు ముదురు మందపాటి పొడవాటి జుట్టు ప్రధాన అంశాన్ని తీసుకుంటుంది.

మన ముఖం అందంగా, మెరిసిపోయేలా, జుట్టు ఆరోగ్యంగా పెరగాలంటే బయటి నుంచి రకరకాల కెమికల్ ప్రొడక్ట్స్ కొని వాడుతూ ఉంటాం. కొందరు వ్యక్తులు తమ చర్మం లేదా జుట్టులో ఎటువంటి మెరుగుదల లేకుండా ఆ రసాయన ఉత్పత్తులను ఉపయోగించడం వల్ల పెద్దగా ప్రయోజనం లేకుండా బాధపడటం మనం చూశాము.

ఇలాంటి కెమికల్స్ వాడతారేమో అని కంగారు పడకుండా మీ ఇంటి కిచెన్ లో లభించే మెంతులు మాత్రమే వాడటం ద్వారా మీ ముఖం మరియు జుట్టు నిగనిగలాడేలా ఎలా ఉంచుకోవాలో ఈ పోస్ట్ ద్వారా తెలుసుకోవచ్చు.

మెంతులు: మెంతులలో ఉండే ఐరన్ కంటెంట్ నెరసిపోవడాన్ని నివారిస్తుంది మరియు జుట్టు రాలడాన్ని నియంత్రిస్తుంది. రకరకాల జుట్టు సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని అందిస్తుంది.

చర్మానికి మెంతులు ఎలా ఉపయోగించాలి: ఫేస్ పౌడర్ కోసం: మెంతులను రాత్రంతా నీళ్లలో నానబెట్టి మిక్సీ జార్ లో వేసి పాలు పోసి గ్రైండ్ చేసి ప్యాక్ చేసి ముఖానికి పట్టించి ఆరిన తర్వాత నీళ్లతో ముఖం కడుక్కోవాలి.

కాలుష్య కారకాలను తొలగిస్తుంది: మెంతులు కలిపిన నీటితో మీ ముఖాన్ని కడుక్కోవడం వల్ల చర్మంలోని మలినాలను తొలగిస్తుంది మరియు చర్మం నుండి చర్మానికి తేమను అందిస్తుంది.

మొటిమల కోసం: మెంతులలో ఉండే విటమిన్-సి మొటిమలు ఏర్పడకుండా నిరోధిస్తుంది. అదనంగా, ఇది ముడతల రూపాన్ని తగ్గిస్తుంది. జుట్టు రాలడాన్ని నియంత్రించే ఐరన్ కూడా ఇందులో ఉంటుంది.

జుట్టు కోసం మెంతులు ఎలా ఉపయోగించాలి: జుట్టు పెరుగుదల కోసం: మెంతులను రాత్రంతా నీళ్లలో నానబెట్టి మరుసటి రోజు ఉదయం మిక్సీ జార్ లో మెత్తగా రుబ్బి తలకు రాసుకుని కాసేపు నానబెట్టాలి. తలస్నానం చేసిన తర్వాత నీళ్లతో తలస్నానం చేస్తే జుట్టు రాలడాన్ని నియంత్రిస్తుంది, పొడిబారకుండా చేస్తుంది మరియు మృదువైన జుట్టును ఇస్తుంది.

జుట్టు నష్టం కోసం: జుట్టు రాలడాన్ని నివారించడానికి, కొబ్బరి నూనెలో మెంతి నూనెను మరిగించి, ప్రతిరోజూ తలకు రుద్దడం వల్ల జుట్టు రాలడాన్ని నివారించి, జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది.

చుండ్రు కోసం: తల దురద, చుండ్రుతో బాధపడేవారు మెంతి గింజలను రాత్రంతా నీళ్లలో నానబెట్టి, మరుసటి రోజు పెరుగుతో మెత్తగా నూరి తలకు పట్టించి 1/2 గంట నానబెట్టి తలకు పట్టించి తలస్నానం చేసి చూడండి. చుండ్రు సమస్య తగ్గుతుంది.

నెరిసిన జుట్టు సమస్యకు: మెంతులను నీళ్లలో నానబెట్టి కరివేపాకుతో కలిపి మెత్తగా నూరి తలకు పట్టించి కొద్దిసేపటి తర్వాత తలస్నానం చేస్తే నెరిసిన జుట్టు తగ్గుతుంది. మృదువైన జుట్టు కోసం: మెంతి గింజలను నీళ్లలో నానబెట్టి, కొబ్బరి పాలు లేదా కొబ్బరి నూనెతో మెత్తగా నూరి తలకు పట్టించి, కాసేపటి తర్వాత తలస్నానం చేస్తే పొడిబారకుండా పోయి జుట్టు మృదువుగా మారుతుంది.

# స్ట్రాబెర్రీతో ఎన్ని లాభాలో తెలుసుకోండిలా



స్ట్రాబెర్రీలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ పళ్లు ఎన్నో రకాల మినరల్స్, విటమిన్లు, ఖనిజాలు మరియు యాంటీయాక్సిడెంట్లను కలిగి ఉంటాయి. ఇందులో పొటాషియం, మాంగనీస్ వంటి ఖనిజాలు అధిక మొత్తంలో ఉంటాయి. ఈ పళ్లలో పీచు పదార్థం కూడా ఎక్కువగానే ఉంటుంది. స్ట్రాబెర్రీలు తినడం వల్ల ఎన్నో రకాల వ్యాధులు దూరమవుతాయి. అంతేకాకుండా మీరు చాలా హెల్తీగా ఉంటారు. స్ట్రాబెర్రీలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో తెలుసుకుందాం.

**స్ట్రాబెర్రీ ప్రయోజనాలు**

స్ట్రాబెర్రీలో ఎన్నో పోషకాలు ఉంటాయి. దీనిని తినడం వల్ల రక్తంలోని చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి.

స్ట్రాబెర్రీలో యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతోపాటు ఒత్తిడిని కూడా దూరం చేస్తుంది.

ఈ ఫ్రూట్ నీటితోపాటు ఫైబర్ ను ఎక్కువ కలిగి ఉంటుంది. ఇది బరువును తగ్గించడంలో సహాయపడుతుంది.

ఇది జీర్ణక్రియను మెరుగు పరచడంతో పాటు అజీర్తి, మలబద్ధకం వంటి సమస్యలు దరిచేరకుండా చేస్తుంది.

స్ట్రాబెర్రీలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది మీ రోగనిరోధక శక్తిని పెంచడమే కాకుండా ఇన్ఫెక్షన్లు రాకుండా అడ్డుకుంటుంది.

స్ట్రాబెర్రీ తినడం వల్ల బీపీ కంట్రోల్‌లో ఉంటుంది. అంతేకాకుండా ఇది కడుపులోని మంటను తగ్గిస్తుంది. క్యాన్సర్ రాకుండా నిరోధించడంలో స్ట్రాబెర్రీ చాలా బాగా ఉపయోగపడుతుంది.

# కొవ్వును అదుపు చేసే ఉసిరి



ఉసిరికాయ మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. దీనిలో విటమిన్లు, ప్రొటీన్లు మన శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అదే సమయంలో ఇందులో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. దీని కారణంగా రోగనిరోధక శక్తి కూడా బలంగా మారుతుంది. అయితే, వగరుగా ఉంటే.. ఉసిరి చాలా మంది పక్కనపెడుతుంటారు. అలాంటి వారు ఉసిరి ప్రయోజనాలు తెలిస్తే షాకవుతారు. ఉసిరిని ఎందుకు తినాలి.. దాని ప్రయోజనాలు ఏంటీ..? శరీరానికి ఎలా ఉపయోగపడుతుంది.

**ఉసిరికాయ తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు..**

రోగనిరోధక శక్తిని పెంచుతుంది: ఉసిరిలో విటమిన్ సి, విటమిన్ బి పుష్కలంగా ఉన్నాయి. కాబట్టి ఇది రోగనిరోధక శక్తిని పెంచడానికి పని చేస్తుంది. దీని కోసం, ప్రతిరోజూ ఒక ఉసిరి లేదా ఉసిరికాయ మురబ్బా.. లేదా దాని రసం తీసుకోవడం మంచిది.

చర్మానికి మేలు చేస్తుంది: ఉసిరిలో విటమిన్లు, యాంటీఆక్సిడెంట్ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. కాబట్టి మీరు దీనిని తీసుకుంటే, రక్తాన్ని శుద్ధి చేయడంలో సహాయపడుతుంది. మొటిమల సమస్య ఉన్నా, లేదా మీ చర్మం టాన్‌గా ఉంటే ఇప్పటి నుంచే ఉసిరికాయను తీసుకోవడం ప్రారంభించాలి. ఇలా చేయడం వల్ల మీరు చాలా ప్రయోజనం పొందుతారు.

బరువు తగ్గుతుంది: ఉసిరి రసం బరువు తగ్గడానికి చాలా మంచిదని భావిస్తారు. అందువల్ల, మీరు కూడా మీ బరువును తగ్గించుకోవాలనుకుంటే ఉసిరిని తప్పనిసరిగా తినాలి. లేకపోతే.. ఉసిరి రసాన్ని తీసుకోవాలి. ఉసిరికాయ రసం తీసుకోవడం ద్వారా మీరు ఒక వారంలో ప్రభావం కనిపిస్తుంది.

కొలెస్ట్రాల్ నియంత్రణలో ఉంటుంది: ఉసిరికాయను రోజూ తీసుకోవడం ద్వారా కొలెస్ట్రాల్ నియంత్రణలో ఉంటుంది. ఇది క్రమంగా మధుమేహం సమస్యను కూడా తొలగిస్తుంది. అందువల్ల, మీరు కొలెస్ట్రాల్ సమస్యతో కూడా ఇబ్బంది పడుతుంటే రోజూ ఉసిరికాయను తినాలి.

# గ్రావెల్ రోడ్డుకి భూమి పూజ



**రావికమతం, (విశాఖ సమాచారమ్):** రావికమతం మండలం కొత్తకోట మేజర్ పంచాయతీ గ్రామంలో బుధవారం ఉదయం రావికమతం జడ్పీటీసీ తలారి రమణమ్మ నిధుల నుంచి 4 లక్షల 50వేల రూపాయలు గ్రావెల్ రోడ్డుకు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. ఈ నిధులతో స్థానిక భూరిమానికట్టు దగ్గరనుంచి వడ్డాది వారి పొలాలు, గుమ్మడి వారి పొలాల వరకు రహదారి ఏర్పాటుకు ఈ నిధులు ఖర్చు చేయనున్నారు. దానికి సంబంధించిన భూమి పూజ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో వైఎస్ఆర్ సిపి జిల్లా ప్రధాన కార్యదర్శి తలారి అదిమూర్తి, కొత్తకోట సర్పంచ్ కోన లోవరాజు, మండల వైఎస్ఆర్ సిపి ప్రధాన కార్యదర్శి శీలం శంకర్రావు, తదితరులు హాజరయ్యారు. జడ్పిటిసి నిధుల నుంచి ఈ రోడ్డు నిర్మాణానికి భూమి పూజా కార్యక్రమం జరగడంతో స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వృద్ధాప్య అవగాహన దినోత్సవం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** వృద్ధాప్య అవగాహన దినోత్సవం సందర్భంగా నగరంలోని ఎన్జీజీవో కాలనీ అక్కయ్యపాలెం వాసి, ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేవీ రమణారావు వృద్ధాప్య దినోత్సవం సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అన్నీ చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రెండు సార్లు డియర్‌నెస్ అలవెన్స్ ఇస్తోందని తెలిపారు. ఆరోగ్య సంరక్షణ కూడా చాలా వరకు మెరుగుపడిందని అన్నారు.

భారతీయ రైల్వేలో వృద్ధాప్య పింఛనుదారుల కోసం వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేయాలని, తద్వారా నిరుపేద వృద్ధాప్య పింఛనుదారులు తమ చివరి రోజులను ప్రశాంతంగా గడపాలని మోదీ ప్రభుత్వాన్ని జమున రాం కోరారు. అంతే కాకుండా రైల్వే ఆసుపత్రుల్లో మంచి వైద్యం అందించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

## సీబీఐకు షాకిచ్చే నిర్ణయాన్ని తీసుకున్న స్టాలిన్ సర్కార్



మోడీ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత దర్యాప్తు సంస్థల్ని తమ జేబు సంస్థలుగా మార్చుకుంటున్నారన్న విమర్శ అంతకంతకూ ఎక్కువ అవుతున్న విషయం తెలిసిందే. తమకు నచ్చని వారిపైనా, రాష్ట్రాలపైనా విచారణ సంస్థల్ని ఉసిగొల్పుతూ వారికి చుక్కలు చూపిస్తున్నట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న మోడీ సర్కారు విషయంలో ఇప్పటికే తొమ్మిది రాష్ట్రాల వారు రొటీన్‌కు భిన్నమైన నిర్ణయాన్ని తీసుకోవటం తెలిసిందే.

కేంద్ర ప్రభుత్వం తన అధీనంలో ఉన్న కేంద్ర దర్యాప్తు సంస్థల్ని దుర్వినియోగ పరుస్తోందంటూ తీవ్రంగా ఆరోపించారు. ఇప్పటికే తొమ్మిది రాష్ట్రాలు సీబీఐకు జనరల్ కన్సెంట్‌ను ఉపసంహరించుకోవటం తెలిసిందే. తాజాగా ఆ జాబితాలోకి తమిళనాడులోని స్టాలిన్ సర్కారు చేరింది. ఇకపై తమిళనాడులో కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐకు స్వేచ్ఛా తలుపులు మూసేసింది స్టాలిన్ సర్కారు. ఏ కేసులో దర్యాప్తుకు అయినా ముందస్తుగా అనుమతి తీసుకోవాలని స్పష్టం చేసింది.

తాజా నిర్ణయం నేపథ్యంలో గతంలో సీబీఐకు ఇచ్చిన అనుమతిని ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. దీంతో తమిళనాడులో ఏదైనా కేసును సీబీఐ దర్యాప్తు చేయాలంటే రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాతే కాలు కదపాల్సి ఉంటుంది. తాజాగా తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీని మనీ లాండరింగ్ కేసులో ఈడీ అరెస్టు చేసారు. అనంతరం ఆయన తీవ్ర అస్వస్థతకు గురైన నేపథ్యంలో ఆసుపత్రిలోని ఐసీయూలో ఉంచి చికిత్స చేస్తున్నారు. ఈ ఉదంతం చోటు చేసుకున్న కొన్ని గంటల వ్యవధిలోనే స్టాలిన్ సర్కారు తాజా నిర్ణయం తీసుకోవటం గమనార్హం.

సీబీఐకు తలుపులు మూసేసిన రాష్ట్రాల్లో తెలంగాణ, పశ్చిమ బెంగాల్, చత్తీస్ గఢ్, రాజస్థాన్, కేరళ, పంజాబ్, జార్ఖండ్, మేఘాలయ, మిజోరాం ఉన్నాయి.

ఈ రాష్ట్రాలకు తోడుగా ఇప్పుడు తమిళనాడు జాబితాలో చేరింది. తమకు షాకిస్తున్న కేంద్ర దర్యాప్తు సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వాలు ఈ తరహాలో రివర్సు షాకులు ఇవ్వటం బాగానే ఉన్నా, వ్యవస్థల మధ్య ఉండాల్సిన సత్ సంబంధాలు ఈ తరహాలో కొనసాగితే రానున్న రోజుల్లో పరిస్థితులు మరింత ఇబ్బందికరంగా మారతాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# బ్రిజ్‌భూషణ్‌పై పోక్సో కేసు తొలగించమని నివేదిక సమర్పించిన ఢిల్లీ పోలీసులు



దిల్లీ: లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటోన్న భాజపా ఎంపీ బ్రిజ్‌భూషణ్‌పై దిల్లీ పోలీసులు గురువారం 1,000 పేజీల ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ క్రమంలోనే ఆయనపై పోక్సో కేసును తొలగించాలని కోరుతూ పాటియాలా హౌస్ కోర్టుకు 500 పేజీల నివేదికను కూడా సమర్పించారు. మైనర్ రెజ్లర్ పెట్టిన కేసును ధ్రువీకరించే సాక్ష్యాలు లేకపోవడంతో పోలీసులు దానిని కొట్టేయాలని కోరుతూ నివేదిక ఇచ్చారు. దీనిపై జులై 4వ తేదీన విచారణ జరగనుంది.

భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడి హోదాలో ఉన్న బ్రిజ్ భూషణ్ మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని కొద్దినెలల పాటు అగ్రశ్రేణి క్రీడాకారులు నిరసన చేపట్టారు. ఈ క్రమంలోనే ఏడుగురు మహిళా రెజర్లు ఆయనపై ఫిర్యాదులు చేయడంతో దిల్లీలోని కన్నాట్ ప్లేస్ పోలీసు స్టేషన్‌లో ఏప్రిల్ నెలలో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఆరుగురు మహిళా రెజర్లతో తొలి ఎఫ్ఐఆర్, మరో మైనర్ రెజ్లర్ తండ్రి ఫిర్యాదుతో రెండో ఎఫ్ఐఆర్‌ను ఏప్రిల్ 28న నమోదు చేశారు. వేధింపులకు గురైనట్లు చెప్తున్న సమయంలో సదరు యువతి మైనర్ కాదని గుర్తించడంతో న్యాయమూర్తి ఎదుట ఆమె నుంచి మరోసారి వాంగ్మూలం తీసుకొన్నట్లు ఇదివరకు వార్తలు వచ్చాయి.

ఈ నేపథ్యంలో దిల్లీ పోలీసులు పోక్సో కేసులను తొలగించాలని కోరుతూ నివేదికను సమర్పించారు. 'దర్యాప్తు పూర్తయిన తర్వాత మైనర్, ఆమె తండ్రి వాంగ్మూలాల ఆధారంగా ఆ పోక్సో సెక్షన్ల తొలగింపు కోరుతూ నివేదిక సమర్పించాం. దర్యాప్తులో ఆ కేసును ధ్రువీకరించే సాక్ష్యాలు లభించలేదు. ఇక రెజ్లర్లకు సంబంధించిన కేసులో దర్యాప్తు పూర్తి చేసి ఛార్జ్‌షీట్ దాఖలు చేశాం' అని పోలీసులు వెల్లడించారు. ఈ ఛార్జ్‌షీట్‌లో మహిళా రెజ్లర్ల మర్యాదకు భంగం కలిగించే రీతిలో వారిపై వేధింపులకు పాల్పడటం గురించి ప్రస్తావించారు.

ఇదిలా ఉంటే ఇటీవల కేంద్ర క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్‌తో సమావేశం తర్వాత రెజ్లర్లు తమ నిరసనను తాత్కాలికంగా విరమించిన సంగతి తెలిసిందే. ఆ సందర్భంగా బ్రిజ్ భూషణ్‌పై ఈ నెల 15 లోపు ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే ఫెడరేషన్‌కు ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ ఎన్నికలు జులై 6న జరగనున్నాయి.

# ఆర్జీయూకేటీలో మరో విద్యార్థిని మృతి



ముథోల్: బాసర ఆర్జీయూకేటీలో మరో విషాదం చోటు చేసుకుంది. వరుసగా రెండో రోజు మరో విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం బాసర ట్రిపుల్ ఐటీలో కలకలం రేపింది. రెండు రోజులు క్రితం పీయూసీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని దీపిక మూత్రశాలలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఆ సంఘటన నుంచి తేరుకోక ముందే గురువారం వేకువజామున 2 గంటల ప్రాంతంలో పీయూసీ మొదటి సంవత్సరం చదువుతున్న లిఖిత(17) అనే విద్యార్థిని వసతి గృహం 4వ అంతస్తు నుంచి కిందపడింది.

తీవ్ర గాయాల పాలవడంతో స్థానిక ఆసుపత్రిలో చికిత్స చేయించిన అనంతరం భైంస ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే, లిఖిత అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఇది ఆత్మహత్యా లేక ప్రమాదవశాత్తు జరిగిందా అనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. ట్రిపుల్ ఐటీ అధికారులు మాత్రం ప్రమాదవశాత్తు జరిగిందని చెబుతున్నారు. ప్రమాదమా లేక ఆత్మహత్య అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లిఖిత స్వస్థలం సిద్దిపేట జిల్లా గజ్వేల్. బుర్ర రాజు, రేణుక దంపతుల పెద్ద కుమార్తె. గజ్వేల్‌లో మిర్చిబండి నిర్వహిస్తూ రాజు పిల్లలను చదివిస్తున్నారు. వారం రోజుల క్రితమే లిఖిత హాస్టల్‌కు వెళ్లిందని ఇంతలోనే ఇలా జరగడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

నిర్మల్ ప్రభుత్వ అస్పత్రి మార్చురీలో ఉన్న విద్యార్థిని లిఖిత మృతదేహాన్ని ఆర్జీయూకేటీ ఇన్చార్జ్ వీసీ వెంకటరమణ పరిశీలించారు. లిఖిత మృతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ "విద్యార్థిని మృతి దురదృష్టకరం. లిఖిత మరణం ప్రమాదవశాత్తు జరిగింది. ఆర్జీయూకేటీలో మరణాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. విద్యార్థులు మనోధైర్యం కోల్పోవద్దు" అని అన్నారు.

# చోరీకి గురైన రూ.8లక్షల విలువైన సెల్‌ఫోన్లు స్వాధీనం

**నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ జిల్లా గాజువాకలో ఉన్న షాడో ఫ్యాక్స్ లాజిస్టిక్ కంపెనీ నుంచి దొంగిలించిన రూ.8లక్షల 8వేల విలువైన 30 సెల్ ఫోన్లు, నాలుగు స్మార్ట్ వాచ్‌లు, నోట్ ప్యాడ్, ల్యాప్ టాప్ దొంగిలించబడ్డాయి. చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామని నర్సీపట్నం రూరల్ సిఐ పి.రమణయ్య తెలిపారు. ఈ కేసులో నలుగురు నిందితులను కూడా అరెస్టు చేయడం జరిగిందని వెల్లడించారు. గురువారం నర్సీపట్నం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. నాతవరం మండలం శృంగవరం గ్రామానికి చెందిన కాళ్ల ఆదిసత్యనారాయణ, సుర్ల వరప్రసాద్, గాజువాక పెదగంట్యాడకు చెందిన గుడె కిరణ్, పల్లేటి అనిల్ అనే వారిని అరెస్టు చేశామని చెప్పారు. షాడో ఫ్యాక్స్ లాజిస్టిక్ కంపెనీ ఆంధ్ర తెలంగాణా ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ టీమ్ మేనేజర్ ఎ.ప్రదీప్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నాతవరం ఎస్సై డి.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో దర్యాప్తు చేశారని చెప్పారు. అమెజాన్, ఫ్లిప్ కార్టు వంటి సంస్థలకు వస్తువులు సరఫరా చేసే షాడో ఫ్యాక్స్ లాజిస్టిక్ కంపెనీ నుంచి గత కొంత కాలంగా పెద్ద ఎత్తున సామగ్రి చోరీ జరుగుతున్న విషయాన్ని కంపెనీ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ టీమ్ గుర్తించింది. కంపెనీలో పని చేస్తున్న నాతవరం మండలం శృంగవరం గ్రామానికి చెందిన కాళ్ల ఆదిసత్యనారాయణ కంపెనీ సిసి కెమెరాలను ఆపివేసి సామగ్రిని దొంగిలించినట్లు గుర్తించారు. దీనిపై నాతవరం పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. కేసు విచారణ చేసిన ఎస్సై లక్ష్మీనారాయణ 33 సెల్ ఫోన్లు, నాలుగు స్మార్ట్ వాచ్‌లు, రెండు వెబ్ కెమెరాలు, ఒక నోట్ ప్యాడ్, ఒక ల్యాప్ టాప్ స్వాధీనం చేసుకున్నారు. ముద్దాయిలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామని రూరల్ సిఐ రమణయ్య తెలిపారు.

# నానిని హెచ్చరించిన వీరసూర్య



**నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):** మాజీ మంత్రి పేర్ని నాని ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడితే మంచిదని జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర హెచ్చరించారు. గురువారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడుతూ జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ వారాహి యాత్రకు వచ్చిన ప్రజలను చూసి పేర్ని నానికి నిద్రపట్టలేదని, దీంతో గురువారం ఉదయమే మీడియా ముందుకు వచ్చి పవన్‌కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. పవన్‌కళ్యాణ్ ఎప్పుడు మీటింగ్‌లు పెట్టినా తగుదునమ్మా అంటూ పేర్ని నాని మీడియా ముందుకు వచ్చి కామెడి చేయడం అలవాటుగా మారిందన్నారు. ఇకపై జనసేనాని పవన్‌కళ్యాణ్ జోలికి కానీ జనసైనికుల జోలికి వస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. పవన్‌కళ్యాణ్ ఒక వ్యక్తి కాదని, ఒక శక్తి అని, రాబోయే ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ సత్తా ఏంటో వైసిపి వాళ్లకు తెలుస్తుందన్నారు. ఇకనైనా దిగజారుడు వ్యాఖ్యలు మాని ఉన్న ఏడాదైనా మచిలీపట్నం నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారిస్తే బాగుంటుందని ఆయన నానికి హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, సలాదుల ప్రసాద్, డాక్టర్ నారాయణరావు, గొలుగొండ మండల అధ్యక్షులు గండెం దొరబాబు, సీనియర్ నాయకులు రేగుబల్ల శివ, వాసం వెంకటేష్, కర్రి సంతోష్, బైన మురళీ, బోయిన చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# సివిల్ కోర్టుకు హాజరైన నర్సీపట్నం ఎమ్మెల్యే



**నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):** 2009 సంవత్సరం సమైక్యాంధ్ర ఉద్యమంలో విభజనకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోసం ఉద్యమం చేస్తున్న సమయంలో నర్సీపట్నం పట్టణ పోలీసులు కేసు నమోదు చేయగా గురువారం కోర్టు వాయిదా నిమిత్తం నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్‌తో పాటు పలువురు వైసిపి నాయకులు కోర్టుకు హాజరయ్యారు. అనంతరం మెజిస్ట్రేట్ విచారణ జరిపి వచ్చే నెల 12వ తేదీకి వాయిదా వేయడం జరిగింది. కోర్టుకు హాజరు హాజరైన వారిలో మున్సిపల్ వైస్ చైర్మన్ తమనార అప్పల నాయుడు, కొనేటి రామకృష్ణ, పట్టణ వైసిపి అధ్యక్షుడు ఏకా శివ, గుడబండి నాగేశ్వరరావు, తమరాన శ్రీను, శేషు, జోగుపాలెం మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యా వైద్యానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** రాష్ట్ర ప్రభుత్వం విద్యా వైద్యానికి పెద్దపీట వేస్తోందని అందులో భాగంగా పేద విద్యార్థుల కోసం జగనన్న విద్యా కానుక ప్రతి సంవత్సరం సమర్థవంతంగా అమలు చేస్తోందని అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలో గల అక్కిరెడ్డిపాలెం గ్రామ సచివాలయం పరిధిలో తారకరామ కాలనీలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను ఎంపీపీ సూరిబాబు పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ కార్పొరేట్ సెక్టార్‌కు సమానంగా రాష్ట్ర ప్రభుత్వం నడిపే ప్రభుత్వ స్కూళ్ళలో విద్యా విధానం ఉండాలని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆలోచించారు. ఆ విధంగానే ప్రతి స్కూల్లో నాడు - నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అధునాతనంగా రూపొందించారని అన్నారు. అనంతరం అంగన్వాడి కేంద్రంలో వైయస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణీలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిఎసి డైరెక్టర్ నారపిన్ని ప్రసాదరావు, స్కూల్ హెడ్‌మాస్టర్ ప్రసాదరావు, ఎలిమెంటరీ స్కూల్ చైర్మన్ గణేష్, పంతం శీను, బొండా అప్పారావు, సచివాలయ కన్వీనర్ ధనలక్ష్మి, తంగేటి ప్రకాష్, తీగల మోహన్, కనుబుడ్డి శంకర రావు, ఉపాధ్యాయులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, పిల్లల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# గడపగడపకు కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచారం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఈ నెల 21 నుండి 30వ తేదీ వరకు కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి గడపకు తీసుకు వెళ్లేందుకు ఒక ప్రణాళిక రూపొందించామని భారతీయ జనతా పార్టీ జిల్లా ఇన్చార్జ్ మాలకొండయ్య తెలిపారు. గురువారం స్థానిక భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాల బ్రోచర్లను బిజెపి నాయకులు ఆవిష్కరించారు. సమావేశంలో పార్టీ జిల్లా ఇన్చార్జ్ మాలకొండయ్య మాట్లాడుతూ విశాఖ సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర మంత్రులు స్పందించిన తీరు చాలా విడ్డూరంగా ఉందని, అలాగే ఈ జిల్లా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వ్యాఖ్యలపై ఎన్నార్జియస్ పథకంలో జరిగిన అవినీతిపై ఈ రాష్ట్ర ప్రభుత్వం విచారణకు సిద్ధమా అని సవాల్ విసిరారు

ఈ విలేఖరుల సమావేశంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.బి.సాయిరాం, జిల్లా ప్రధాన కార్యదర్శి చదరం నాగేశ్వరరావు, అసెంబ్లీ కన్వీనర్ బొడ్డేడ నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి పుడా రమేష్, మండల అధ్యక్షులు వి.నర్సింగ్ యాదవ్ జిల్లా స్పోర్ట్స్ సెల్ కన్వీనర్ కొణతాల కృష్ణ పాల్గొన్నారు.

# మార్కెట్ కమిటీ నూతన కార్యాలయ భవనాన్ని ప్రారంభించిన మంత్రి బొత్స

**విజయనగరం:** చీపురుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యాలయ భవనాన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ గురువారం ప్రారంభించారు. గరివిడి మండలం కొడూరు వద్ద రూ.50 లక్షల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఎస్, ఆర్.డి.ఓ. అప్పారావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ దన్నాన జనార్ధనరావు, కార్యదర్శి ఎన్.భువనేశ్వరి, గరివిడి తహశీల్దార్ టి.గోవింద, చీపురుపల్లి తహశీల్దార్ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**డిజిటల్ లైబ్రరీకి శంకుస్థాపన**

చీపురుపల్లి ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో రూ.16 లక్షల వ్యయంతో నిర్మించనున్న డిజిటల్ లైబ్రరీకి మంత్రి బొత్స సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో దీనిని నిర్మించనున్నారు. జిల్లాపరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జిల్లాపరిషత్ డిప్యూటీ సీఇఓ రాజ్ కుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# తల్లిదండ్రుల కంటే మిన్నగా విద్యార్థులకోసం ఆలోచిస్తున్న సి.ఎం. జగన్

**విజయనగరం:** రాష్ట్రంలో విద్యార్థుల భవిష్యత్తు కోసం వారి తల్లిదండ్రుల కంటే మిన్నగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ ఆలోచిస్తున్నారని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రి ఉండటం విద్యార్థుల అదృష్టమని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యార్థులను విద్యాధికులుగా రూపొందించే లక్ష్యంతో వారిలో స్ఫూర్తి నింపేందుకే 'జగనన్న ఆణిముత్యాలు' పేరుతో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నగదు పారితోషికాలు అందించే కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని చెప్పారు. 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమంలో భాగంగా చీపురుపల్లి నియోజకవర్గ స్థాయిలో ఈ ఏడాది పదోతరగతి, ఇంటర్‌లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందించే కార్యక్రమాన్ని చీపురుపల్లి జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పాఠశాల దశ నుంచే జీవితంలో తాను సాధించదలచిన లక్ష్యాలను ఏర్పరచుకోవాలని కోరారు. ఈ విషయంలో వారి తల్లిదండ్రులు వారికి మార్గనిర్దేశం చేయాలన్నారు. ప్రతి విద్యార్థి విద్యలో రాణించి వృద్ధి చెందాలని ఆకాంక్షించారు.



పాఠశాల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో ఆణిముత్యాలు కార్యక్రమం కింద నగదు పారితోషికాలు అందిస్తున్నామని మంత్రి చెప్పారు. జిల్లా స్థాయిలో ఈనెల 17వ తేదీన ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించి విద్యార్థులను నగదు పారితోషికంతో సత్కరిస్తామని, 20వ తేదీన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారని చెప్పారు.

రాష్ట్రంలో 6వ తరగతి నుంచే విద్యార్థులకు డిజిటల్ విద్యను అందిస్తున్నామని, దీనిలో భాగంగా అన్ని స్కూళ్లలో ఇంటరాక్టివ్ లెర్నింగ్ విధానాన్ని ప్రవేశపెడుతున్నట్టు చెప్పారు. దేశంలో ఒక్క మన రాష్ట్రంలో మాత్రమే డిజిటల్ విద్యను అందిస్తున్నామని, ప్రపంచ ప్రమాణాలతో మన విద్యార్థులను తీర్చిదిద్దే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి జగన్ విద్యలో డిజిటలైజేషన్ చేపట్టారని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను పెంచే లక్ష్యంతో ప్రతి మండలానికి రెండో మండల విద్యాధికారిని నియమిస్తున్నామని చెప్పారు. విద్యాకానుక కిట్ల పంపిణీపై మంత్రి ఆరా తీశారు. రెండు రోజుల్లోగా కిట్ల పంపిణీని పూర్తిచేయాలని ఆదేశించారు. కిట్‌లోని అన్ని వస్తువులను ఒకేసారి ఇస్తేనే స్వీకరించాలని తల్లిదండ్రులకు సూచించారు.

జిల్లాపరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్ని కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా రూపొందించడంలో ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్.జగన్ కృషికి ఉపాధ్యాయులు కూడా తోడ్పాటు అందించడం వల్లే విద్యారంగంలో మంచి ఫలితాలు సాధించగలుగుతున్నామని చెప్పారు. అన్ని ప్రభుత్వ స్కూళ్లకు మౌళిక వసతులు కల్పిస్తూ విద్యార్థులకు ఏ లోటూ లేకుండా సి.ఎం. చేస్తున్నారని పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో ఎన్నో మార్పులు తీసుకు వచ్చిందన్నారు. పాఠశాలలకు వచ్చే పిల్లలకు విద్యాకానుక కిట్లను అందించడంతోపాటు పాఠశాలల్లో వసతులు, మంచి పౌష్టికాహారం అందిస్తున్నదని వీటన్నింటినీ సద్వినియోగం చేసుకొని విద్యార్థులు విద్యలో బాగా రాణించాలన్నారు. పిల్లలు మరింత ఆరోగ్యంగా రూపొందాలనే లక్ష్యంతో ప్రభుత్వం గోరుముద్ద కార్యక్రమం చేపట్టిందన్నారు. జిల్లాలో పదో తరగతి, ఇంటర్ ఫలితాలు గతంలో కంటే బాగా మెరుగయ్యాయని కలెక్టర్ చెప్పారు.

చీపురుపల్లి బాలుర పాఠశాలలో ఇంటరాక్టివ్ లెర్నింగ్ ప్యానెల్‌ను మంత్రి ప్రారంభించారు. ఇంజనీరింగ్ కళాశాలలను ప్రభుత్వ స్కూళ్లతో అనుసంధానిస్తున్నామని మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. జిల్లాలో 1327 పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ప్యానల్స్‌ను, నియోజకవర్గంలో 193 పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు.

రాష్ట్రంలో ఇంజనీరింగ్ కళాశాలల్ని స్కూళ్లతో అనుసంధానిస్తామని మంత్రి చెప్పారు. ఒక్కో ఇంజనీరింగ్ కళాశాలతో 10 నుంచి 15 పాఠశాలలను అనుసంధానం చేస్తామన్నారు. ఆయా కళాశాలల్లోని విద్యార్థులు పాఠశాల విద్యార్థులకు డిజటల్ బోధనలో సహకరించడంతోపాటు చివరి సంవత్సరం విద్యార్థులు తమ స్టడీ టూర్‌ను ఆయా పాఠశాలల్లో చేసేవిధంగా కార్యక్రమాన్ని రూపొందిస్తున్నామని చెప్పారు. నాడు-నేడు కింద పనులు పూర్తయిన పాఠశాలల్లో వాచ్‌మెన్‌ల నియామకాన్ని త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మిని మంత్రి కోరారు. మధ్యాహ్న భోజనం వర్కర్ల కుటుంబాలకు చెందిన వారు, గ్రామంలోని మాజీ సైనికులకు వాచ్‌మెన్ నియామకంలో తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

చీపురుపల్లి నియోజకవర్గ స్థాయిలో పదో తరగతిలో మొదటి ర్యాంకులో నిలిచిన మెట్టపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని లావేటి తేజశ్రీ, ఏపి మోడల్ స్కూల్ గర్భాం విద్యార్థిని యలకల సాయిస్ఫూర్తిలకు రూ.15 వేల చొప్పున, జెడ్పీహెచ్ ఎస్, మెట్టపల్లికి చెందిన మీసాల లావణ్య, ఇప్పిలి నీలావతి రెండో ర్యాంకులో నిలవడంతో వారిద్దరికీ రూ.10 వేల చొప్పున, తృతీయ ర్యాంకులో నిలిచిన బైరిపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి తాడేల గణేష్‌కు రూ.5000ల నగదు పారితోషికం, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు. ఆయా విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులను కూడా మంత్రి సత్కరించారు.

నియోజకవర్గ స్థాయిలో ఇంటర్‌లో ఎంపిసి గ్రూపులో టాపర్‌గా నిలిచిన మునకాల ఉమ, బైపిసిలో టాపర్‌గా నిలిచిన బాడారి కృష్ణవేణి, హెచ్.ఇ.సి.లో టాపర్‌గా నిలిచిన దాసరి షణ్ముఖరావు, ఎంఇసిలో టాపర్‌గా నిలిచిన బాలి కీర్తిలకు ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున మంత్రి బొత్స అందజేసి వారిని సత్కరించారు.

**యువతకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేత**

చీపురుపల్లి నియోజకవర్గ స్థాయిలో జూన్ 9న నిర్వహించిన మెగా జాబ్ మేళా సందర్భంగా వివిధ సంస్థల్లో ఎంపికైన పలువురు యువతకు మంత్రి నియామక పత్రాలు అందజేశారు. ఈ జాబ్‌మేళాలో 685 మంది యువతీ యువకులు వివిధ పారిశ్రామిక వాణిజ్య సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఏపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ ఎన్.గోవిందరావు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి లింగేశ్వర రెడ్డి, ఆర్.డి.ఓ. అప్పారావు, తహశీల్దార్ సురేష్ కుమార్, ఎంపిడిఓ, స్థానిక నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## డ్రైవర్ బోరయ్య కుటుంబానికి అండగా తూర్పు కాపు సంక్షేమ సంఘం



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** జీవీఎంసీ 85వ వార్డు డొంకాడ గ్రామ నివాసి చంద్రపటీ బోరయ్య డ్రైవర్‌గా జీవనం సాగించేవాడు ఇటీవల అనారోగ్యం కారణంగా మరణించాడు. ఇతనికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. పేదవారైనా జగనన్న భీమా పథకం రాకపోవటంతో సదరు సమస్య తూర్పు కాపు నాయకులు మడక రమేష్ నాయుడుకి తెలిసి పరవాడ తూర్పు కాపు అసోసియేషన్ తరపున మృతుడి భార్య లక్ష్మికి ఆమె స్వగృహం వద్ద రెండు నెలల నిత్యవసర వస్తువులు, 5వేల రూపాయల నగదు గురువారం అందజేశారు. రమేష్ మాట్లాడుతూ కీర్తిశేషులు బొర్రయ్య కుటుంబానికి చేదోడుగా పరవాడ మండల తూర్పు కాపు సోదరులు సహాయ సహకారాలు అందించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు

ఏడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ పేదవారైన కాపు సోదరులను ఆదుకోవడంలో మడక రమేష్ నాయుడు చొరవ తీసుకుని ఆదుకున్నందుకు అభినందనలు తెలియజేశారు. కాపు కార్పొరేషన్ ద్వారా ఇటువంటి పేదవారిని ప్రభుత్వ ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ సొసైటీ లో అఖిల భారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపకులు రవణం స్వామినాయుడు పుట్టినరోజు సందర్భంగా విశాఖపట్నం జిల్లా రెడ్ క్రాస్ లో కోయిలాడ శ్రీనివాసరావు పర్యవేక్షణ లో మహా రక్తదానశిబిరం నిర్వహించారు.ప్రతీ ఏటా జూన్ 15న తేదీన అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపకులు రవణం స్వామినాయుడు పుట్టినరోజు ను పురస్కరించుకొని వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.ఈ నేపథ్యంలో ఈ ఏడాది రెడ్ క్రాస్ లో మెగా రక్తదాన శిభిరం నిర్వహించి అధిక మొత్తంలో రక్తదానం చేసారు.

ఈ కార్యక్రమానికి విశిష్ట అతిధిలుగా రెడ్ క్రాస్ కార్యదర్శి రవికుమార్, రెడ్ క్రాస్ pro రావులు హాజరై కేక్ కట్ చేసి రక్తదానం చేసిన ప్రతి ఒక్కరిని అభినందించారు, ఈ కార్యక్రమం లో గాజువాక మెగాఫ్యామిలీ యువత అధ్యక్షులు పాలరౌతు వెంకటరమణ, ప్రధానకార్యదర్శి బొంతు కనకరాజు, సిటీ నుండి వాసుపల్లి ఎల్లాజిరావు, mvp ఎల్లాజిరావు, రమేష్ పాల్గొన్నారు.

## డ్రగ్స్ కేసులో ఇద్దరు టాలీవుడ్ హీరోయిన్లు ఒక డిరెక్టర్?



ఇప్పటికే ఒకసారి టాలీవుడ్ లో కలకలం సృష్టించిన డ్రగ్స్ వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. తాజాగా కొకైన్ తో పట్టుబడిన "కబాలి" నిర్మాత కేపీ చౌదరి అరెస్ట్ నేపథ్యంలో మళ్లీ టాలీవుడ్ డ్రగ్స్ వ్యవహారం హాట్ టాపిక్ గా మారింది! అయితే ఈ సమయంలో కేపీ చౌదరి వద్ద నుంచి స్వాదీనం చేసుకున్న నాలుగు సెల్ ఫోన్లు ఒక ల్యాట్ ట్యాప్ లోని డేటాను విశ్లేషించే పనిలో పోలీసులు ఉన్నారని సమాచారం!

అవును... కేపీ చౌదరిని అరెస్ట్ చేసిన క్రమంలో పోలీసులు.. అతడి వద్ద నుంచి 82.75 గ్రాముల కొకైన్ రూ.2.05 లక్షల నగదు బెంజ్ కారు నాలుగు సెల్ ఫోన్స్ ఒక ల్యాప్ టాప్ ను స్వాధీనం చేసుకున్నారని తెలుస్తుంది.

సినీ హెూటల్ వ్యాపార రంగాల్లో నష్టం రావటంతోనే.. కేపీ చౌదరి గోవా కేంద్రంగా మత్తు దందా చేపట్టాడని రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. తాను వినియోగించేందుకు స్నేహితులకు విక్రయించేందుకు మత్తుపదార్థాలు తీసుకొచ్చినట్లు పోలీసుల ఎదుట అంగీకరించాడని డీసీపీ తెలిపారు!

అతని మొబైల్ ఫోన్ డేటా ఆధారంగా ఎవరెవరు అతనితో చాటింగ్ చేశారు అన్నదానిపై పోలీసులు వివరాలు సేకరించి విశ్లేషిస్తున్నారు. ఫోన్ ను పూర్తిగా పరిశీలించి ఈ డ్రగ్స్ లింక్స్ లో ఎవరెవరు ఉన్నారో వారి పేర్లు బయటపెడతామని పోలీసులు చెబుతున్నారు. అయితే ఈ కేసులో ఇద్దరు టాలీవుడ్ హీరోయిన్లు నలుగురు లేడీ యాక్టర్లు ఒక డైరెక్టర్ ఉన్నట్లు వార్తలొస్తున్నాయి!

ఈ నేపథ్యంలో కేపీ చౌదరిని అరెస్టు చేసిన తర్వాత ఆయనను కోర్టు ముందు హాజరుపరచగా.. కోర్టు ఆయనకు 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. ప్రస్తుతం కేపీని పోలీసులు చర్లపల్లి జైలుకు తరలించారు!

అయితే... గత నెల 5న మాదాపూర్ ఎస్వోటీ రాయదుర్గం పోలీసులు నానక్ రామ్ గూడ సమీపంలో 300 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నిందితుడైన రాకేష్ రోషన్ వాట్సప్ ద్వారా కేపీ చౌదరితో లావాదేవీలు జరిపినట్టు గుర్తించారు. దీంతో.. పక్కా సమాచారంతో అతడిని అరెస్టు చేశారు.

## తల్లిదండ్రుల మృతదేహాల పక్కనే మూడు రోజులుగా పసికందు



అటు తల్లి ఇటు తండ్రి విగతజీవులుగా పడి ఉండగా మధ్యలో రోజుల పసికందు కొనఊపిరితో కొట్టుమిట్టాడు తున్నాడు. ఒకటి రెండు కాదు కనీసం మూడు రోజులుగా ఆ పసికందు అలాగే ఉన్నాడట. ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో చుట్టుపక్కల వారు ఫిర్యాదు చేయగా పోలీసులు తలుపులు బద్దలు కొట్టి లోపలికి ప్రవేశించారు. లోపల కనిపించిన దృశ్యం అక్కడున్న వారందరినీ కంటతడి పెట్టించింది. డెహ్రాడూన్ పోలీసులకు ఎదురైన విషాద సంఘటన ఇది.

ఉత్తరప్రదేశ్‌కు చెందిన కాషిఫ్, అనమ్ దంపతులు డెహ్రాడూన్‌లో స్థిరపడ్డారు. అనమ్ ఈ నెల 8న ఓ బాబుకు జన్మనిచ్చింది. ఇంతలో ఏం జరిగిందో తెలియదు కానీ రెండు మూడు రోజులుగా వారు ఇంట్లో నుంచి బయటకు రాలేదు. ఇరుగుపొరుగు వారు కూడా పట్టించుకోలేదు. అయితే, కాషిఫ్ ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తలుపులు బద్దలుకొట్టి ఇంట్లోకి అడుగుపెట్టగా నేల మీద ఓ వైపు కాషిఫ్, మరోవైపు అనమ్ విగతజీవులుగా పడి ఉన్నారు. వారి మృతదేహాల మధ్య సొమ్మసిల్లిన స్థితిలో రోజుల పసికందు కనిపించాడు.

అక్కడి పరిస్థితి చూస్తే కాషిఫ్, అనమ్ చనిపోయి మూడు రోజులకు పైనే అయి ఉంటుందని పోలీసులు చెప్పారు. మూడు రోజులుగా పసికందు అలాగే ఉన్నాడని, ఆకలికి ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి పడిపోయాడని వివరించారు. బాబును వెంటనే ఆసుపత్రికి తరలించగా ఇంటెన్సివ్ కేర్ యూనిట్ లో పెట్టి వైద్యులు చికిత్స చేస్తున్నారు. కాగా, ఆర్థిక సమస్యలతో ఆ దంపతులు ఆత్మహత్య చేసుకుని ఉండచ్చని పోలీసులు భావిస్తున్నారు.

## రక్తదాతలుగా మారండి

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా వ్యక్తులు/ సంస్థలు/ సంస్థలను సత్కరించడానికి సమావేశాన్ని నిర్వహించింది.

ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ కార్యక్రమానికి ఎస్.శినివాసరావ, డిఆర్ఓ, సిహెచ్. పూర్ణేంద్రబాబు, డిఎల్ఓ మరియు డిఎంహెచ్ఓ జగదీశ్వరరావు ఆహ్వానితులు.

రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాక్టర్ వై. శివనాగేంద్ర రెడ్డి తన ప్రారంభ ప్రసంగంలో మంచి కార్యానికి తమ శక్తి సామర్థ్యాలను అందించి, తద్వారా కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకున్న దాతలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

రెడ్‌క్రాస్ తలసేమియా కేంద్రాన్ని ప్రారంభించిందని, ఇక్కడ రోగులకు ఉచిత రక్తం, ఉచిత మార్పిడి మరియు ఆహారంతో సాంత్వన చేకూరుతుందని ఆయన తెలిపారు. కానీ రక్తం కొరత కారణంగా, డిమాండ్‌ను పరిష్కరించడం కొన్నిసార్లు కష్టంగా మారింది.

అందువల్ల చాలా మంది ప్రాణాలను కాపాడేందుకు రక్తదానాన్ని ప్రోత్సహించాలని అభ్యర్థించారు. రెడ్‌క్రాస్ యొక్క వివిధ కార్యకలాపాలను కూడా ఆయన తెలియజేశారు.

జాయింట్ కలెక్టర్ తన ప్రసంగంలో రెడ్‌క్రాస్ మంచి పని చేసినందుకు అభినందించారు మరియు వ్యక్తులు/ సంస్థలు/ సంస్థలకు అవార్డులను ప్రదానం చేశారు.

రెడ్‌క్రాస్‌కు సభ్యత్వం కోసం వెళ్లాలని మరియు సమాజానికి సహాయం చేయడానికి ఇంకా చాలా మందిని తీసుకురావాలని సూచించారు.

## స్కూల్ బస్సులపై రవాణాశాఖ అధికారుల ప్రత్యేకత తనిఖీలు



**కలెక్టరేట్, (విశాఖ సమాచారమ్):** మద్దిలపాలెం, బోయపాలెం, ఎన్ఏడి గాజువాక, షీలా నగర్, బీచ్ రోడ్డు చాపులమాడుం జంక్షన్ తదితర ప్రాంతాలలో 400 పైగా స్కూలు బస్సులను తనిఖీ చేయడం జరిగింది. అయితే ఈ తనిఖీలలో అన్ని బస్సులకు ఫిట్నెస్ సర్టిఫికెట్లు ఉన్నాయని తెలియజేయడమైంది

ఈ తనిఖీలు ఈనెల 30వ తారీకు వరకు కూడా కొనసాగుతాయి. ఏ బస్సు అయినా సరే ఫిట్నెస్ లేకుండా తిరుగుతున్నట్లైతే ఆ బస్సులపై మరియు యాజమాన్యం పై చర్యలు తీసుకుంటామని తెలియజేయడమైనది.

ఈ తనిఖీల లో మోటర్ వాహన తనిఖీ అధికారులు బుచ్చిరాజు, గణేష్ రెడ్డి బాలాజీ రావు,హరిప్రసాద్,మన్మోహన్, శ్రీనివాస్ యాదవ్, పి శిరీష, సత్యం నాయుడు స్పజన పాల్గొన్నారు

## నిండు గర్భిణి ఆత్మహత్య

అనకాపల్లి: మండలంలో వెదుళ్ల పాలెం గ్రామానికి చెందిన గర్భిణి కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామానికి చెందిన ఓరుగంటి శ్రావణి (21)కి పెనుగొల్లుకు చెందిన శివతో మూడు మాసాల క్రితం వివాహం జరిగింది. ప్రస్తుతం ఈమె రెండు నెలల గర్భిణి. ఈమె తరచూ కడుపు నొప్పితో బాధపడుతోందని, కుటుంబ సభ్యులు తెలిపారు. కడుపునొప్పి తీవ్రంగా రావడంతో తన గదిలోకి వెళ్లి చీరతో ఉరేసుకుందన్నారు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆమెను కిందికి దించి ఆస్పత్రికి తరలించేలోపే మరణించిందని కుటుంబ సభ్యులు తెలిపారు. తమ కుమార్తె కడుపునొప్పి తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిందని, ఆమె తల్లి పద్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శిరీష తెలిపారు.

## 400 కార్లలో అనుచరులతో కలిసి కాంగ్రెస్ లో చేరిన మధ్యప్రదేశ్ బీజేపీ ఎమ్మెల్యే




మధ్యప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీ నుంచి బీజేపీలో చేరిన ఓ ఎమ్మెల్యే ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ పార్టీలో చేరాడు సొంతగూటిలో చేరేందుకు ఏకంగా 400 కార్ల భారీ కాన్వాయ్‌తో ర్యాలీగా రావడం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఈ భారీ కాన్వాయ్ కి సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. మధ్యప్రదేశ్‌లోని శివపురి ఎమ్మెల్యే బైజ్ నాథ్ 2020 లో కాంగ్రెస్ పార్టీ నుంచి బీజేపీలో చేరారు. జ్యోతిరాధిత్య సింధియాతో కలిసి పార్టీ మారిన నేతల్లో ఈయన కూడా ఉన్నారు. బీజేపీ తరపున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

అయితే, వచ్చే ఎన్నికల్లో శివపురి టికెట్ తనకు దక్కే సూచనలు కనిపించడంలేదని, లాబీయింగ్ చేసినా ఉపయోగం లేదని తేలిపోవడంతో బైజ్ నాథ్ పార్టీ మారాలని నిర్ణయించుకున్నారు.

ఈమేరకు కాంగ్రెస్ నేతలతో జరిపిన చర్చలు ఫలించడంతో తిరిగి సొంతగూటికి వెళ్లనున్నట్లు బైజ్‌నాథ్ ప్రకటించారు. కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా ఎమ్మెల్యే బలప్రదర్శన చేపట్టారు. ఏకంగా 400 కార్లతో కాన్వాయ్ ఏర్పాటు చేసుకుని, శివపురి నుంచి భోపాల్ ప్రయాణించారు. ఈ ర్యాలీకి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## పోలీసులను సన్మానించిన బ్రహ్మకుమారిస్



కలెక్టరేట్, (విశాఖ సమాచారమ్): దేశవ్యాప్తంగా బ్రహ్మకుమారిస్ వారు కరోనా సమయంలో సేవలను అందించిన వారిలో ముఖ్యమైన పాత్రను పోషించిన పోలీస్ వ్యవస్థను దేశవ్యాప్తంగా సన్మానిస్తున్నారు. ఇందులో భాగంగా వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వారిని సన్మానించారు.

ఈ కార్యక్రమం లో మొదటగా వన్ టౌన్ సి.ఐ. రేవతమ్మ, ఎస్.ఐ. త్రివేణి, ఎస్.ఐ. సంతోష్, రైటర్ కుమార్ మరియు వన్ టౌన్ పోలీస్ సిబ్బంది అందరినీ సన్మానించారు. ఈ సందర్భంగా సి.ఐ.రేవతమ్మ మాట్లాడుతూ కరోనా సమయంలో ఆమె చేసిన సేవ మరిచిపోలేనిది అని అలాగే కరోనా సమయంలో కుటుంబానికి కూడా దూరంగా ఉండి ప్రజలకు సేవచేసే భాగ్యం వచ్చింది అని ఒక పోలీస్‌గా గర్వపడుతున్నాను అన్నారు. ఆమె అనుభవాలను బ్రహ్మకుమారిస్ వారితో పంచుకున్నారు.

## ఉన్నత చదువులలో మరింత రాణించండి



ఆరిలోవ, (విశాఖ సమాచారమ్): ఉన్నత చదువుల్లో మరింత రాణించి తల్లిదండ్రులకి మంచి గుర్తింపు తేవాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. గురువారం ఆమె విశాఖపట్నం తూర్పు నియోజకవర్గం స్థాయిలో 10వ తరగతి పరీక్షలలో మొదటి మూడు స్థానాలలో నిలిచిన విద్యార్థినీ విద్యార్థులకు జగనన్న ఆణిముత్యం అనే కార్యక్రమం ఆరిలోవలోని తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థిని విద్యార్థులచే జాతీయ గీతం ఆలాపనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని, ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం పెట్టడంతో పాటు పాఠశాలల అభివృద్ధికి, పిల్లలలో మంచి సృజనాత్మకతను తీసుకువచ్చేందుకు ఎన్నో మంచి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని అమ్మ ఒడి, గోరుముద్ద, నాడు-నేడు, లాంటి వినూత్న కార్యక్రమాలు చేపట్టి పేద విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకువచ్చేందుకు ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. అమ్మ ఒడి ద్వారా పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి తల్లికి 15వేల రూపాయలు ఆమె అకౌంట్లో వేస్తున్నారని, జగనన్న గోరుముద్దలో విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తున్నారని, నాడు-నేడు క్రింద పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు జిల్లాస్థాయిలో 10వ తరగతి పాసైన విద్యార్థినీ విద్యార్థులకు జగనన్న ఆణిముత్యం అనే కార్యక్రమం ప్రతి ఏటా నిర్వహించి మొదటి బహుమతి రూ. 15,000/-, 2వ బహుమతి రూ.10,000/-, మూడు వ బహుమతి రూ. 5,000/- ఇవే కాకుండా పాఠశాల పరిధిలో మొదట బహుమతి రూ.3,000/-, రెండవ బహుమతి రూ. 2,000/-, మూడవ బహుమతి రూ.1,000/- చొప్పున ఇవ్వడమే కాకుండా వారికి మెరిట్ సర్టిఫికేట్ తో పాటు దుస్సాలువతో సత్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు. అంతే కాకుండా విద్యార్థులకు బైజుస్ ట్యాబులను ఇచ్చి వారి విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు 10 పాస్ అయిన తర్వాత ఉన్నత చదువులు చదివేందుకు జగనన్న ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని, జగనన్న పేద విద్యార్థుల చదువు కొరకు వారికి కార్పోరేట్ విద్య అందించేందుకు ప్రతి పేదవానికి కాలేజీ ఫీజులు తానే చెల్లించి వారిని పైకి తీసుకురావడం జరుగుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మంచి నడవడికతో విద్యాబోధన చేసి ఉద్యోగాలలోను రాణించాలని తద్వారా తమ కుటుంబ పోషణే కాకుండా దేశ ప్రగతికి ఎంతో తోడ్పడిన వారవుతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో 10వ తరగతి అలాగే ఇంటర్ విద్యార్థులను, మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులను అభినందిస్తూ ప్రోత్సాహకం అందించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ, ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయురాలు జి.కే.డి. భవాని, పాఠశాల కమిటీ చైర్మన్ జి.ధనలక్ష్మి, కమిటీ సభ్యులు కే. మోహన్ రావు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన చలివేంద్రం కార్యక్రమం



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): విశాఖపట్నంలోని వివిధ ప్రాంతాల్లో తీవ్రమైన వేడిగాలులుల కారణంగా ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు నగరంలోని భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సంస్థ, రైల్వే ఏరియా కమిటీ ఆధ్వర్యంలో, బాలయ్య శాస్త్రి లేఅవుట్ మరియు అక్కయ్యపాలెం భజన సంఘాల ఆధ్వర్యంలో 2023 ఏప్రిల్ 15 నుండి జూన్ 15 వరకు వరుసగా రెండు నెలల పాటు చలివేంద్రం కార్యక్రమం నిర్వహించాయి! ఈ కార్యక్రమం కింద, ప్రతిరోజూ 1000 మందికి పైగా ప్రజలకు చల్లని మజ్జిగ అందించబడింది! రైల్వే ఏరియా కన్వీనర్ పి మోహన్‌రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ముగిసింది.

## ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్‌గా సాయిరాం బొల్లాప్రగడ



కలెక్టరేట్, (విశాఖ సమాచారమ్): ఆంధ్రవిశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్, సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్‌గా ఇఎన్ఎస్ఇఎన్ఎన్ వ్యవస్థాపకులు, సంచాలకులు సాయిరాం బొల్లాప్రగడ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ నుంచి నియామక ఉత్తర్వులను స్వీకరించారు. తన అపార అనుభవంలో విద్యార్థులను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మలచడానికి, విద్యార్థులకు బోధన, పరిశోధన అంశాలలో సహకారం అందించే దిశగా సాయిరాం బొల్లాప్రగడ తన సేవలు అందించాలని వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సూచించారు. విశ్వవిద్యాలయం తనకు ఇచ్చిన ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగిస్తూ విశ్వవిద్యాలయం, విద్యార్థుల అభ్యున్నతికి కృషిచేస్తానని సాయిరాం అన్నారు. ఈ సందర్భంగా సాయిరాంని పలువురు అభినందించారు.

## భారతీయ సంస్కృతిని కాపాడి - సాంప్రదాయ విగ్రహాలకే జీవం పోయండి



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): భారతీయ సంస్కృతి సనాతన ధర్మం హిందూ సాంప్రదాయాలకు పెద్దపీట వేయండని వినాయక చవితిని పురస్కరించుకొని వినాయక ప్రతిమలు తయారు చేసే కళాకారులను వినాయక నిమజ్జనోత్సవం కమిటీ చైర్మన్ ఆడారి కుమారస్వామి కోరారు. వినాయక నిమజ్జనోత్సవ కమిటీ శిల్పులను నేరుగా కలిసి శుద్ధమైన మట్టితో చేసినటువంటి సాంప్రదాయ విగ్రహాలని తయారు చేయాలని, పర్యావరణానికి హాని చేసే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ముడి పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లో విగ్రహాలు తయారు చేయడానికి ఉపయోగించవద్దని ఈ సందర్భంగా కుమారస్వామి విజ్ఞప్తి చేసారు. అనకాపల్లి పట్టణం పరిసర ప్రాంతాల్లో సుమారు 26 మంది శిల్పులను నేరుగా కమిటీతో కలిసి వారికి విజ్ఞప్తి చేశారు. దేవుడిని వివిధ రూపాల్లో చూపరాదని సాంప్రదాయమైనటువంటి గణపతి విగ్రహాలకే మీరు జీవం పోయండని ఈ ఉద్యమాల్లో మీ పాత్ర ఎంతో కీలకమని మీయొక్క సహాయ సహకారాలు అందించాలని కమిటీ కోరింది. అనంతరం శిల్పులు పరమేశ్వరరావు, కళ్యాణ్, జగదీష్ మరియు ఇతర శిల్పులు మాట్లాడుతూ సాంప్రదాయ గణపతి విగ్రహాలను ఏర్పాటు చేయాలని ప్రతి సంవత్సరము వినాయక ఉత్సవ నిమజ్జనోత్సవ కమిటీ ఆరు నెలల ముందే మమ్మల్ని వచ్చి కలవడం మమ్మల్ని గౌరవించడం జరుగుతుందని మేము కూడా ఈ ఉద్యమంలో మనస్ఫూర్తిగా పాల్గొంటున్నామని ఆనందం వ్యక్తపరిచారు. ఈ సంవత్సరం సెప్టెంబర్ 19వ తేదీన జరిగే వినాయక చవితికి భక్తులకు వేల సంఖ్యలో ఉచితంగా మట్టి గణపతులను పంపిణీ చేయుటకు ఇప్పటి నుంచే అన్ని సంస్థలను వినాయక ఉత్సవ నిమజ్జనోత్సవ కమిటీ, పట్టణంలోని అనేక స్వచ్ఛంద సంస్థలు వేల సంఖ్యలో గణపతులను ఉచితంగా పంపిణీ చేయుటకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నాయని, భక్తులు కూడా స్వచ్ఛందంగా ఈ మట్టి గణపతి ఉద్యమంలో పాల్గొనాలని ఈ సందర్భంగా భక్తులను, ప్రజలను చైర్మన్ ఆడారి కుమారస్వామి కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ నేతలు పి. సోమశేఖర్ పట్నాయక్, కొడుకుల శ్రీకాంత్, కొణతాల హరినాథ్ బాబు, తాటికొండ శ్రీకాంత్, దొడ్డి రమణబాబు తదితర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## మంత్రి గుడివాడ అమర్నాథ్ ను సత్కరించిన జగ్గు పిల్ల



ఆరిలోవ, (విశాఖ సమాచారమ్): భీమిలి నియోజకవర్గం మధురవాడ ,చంద్రంపాలెం గ్రామ దేవత శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి ఊరి పండగ మహోత్సవము వైయస్సార్ సిపి నాయకులు, మాజీ కార్పొరేటర్ జగుపిల్ల అప్పలరాజు నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. జగ్గుపిల్ల ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి గుడి వాడ అమర్నాథ్ పాల్గొన్నారు. మంత్రిని జగుపిల్ల అప్పలరాజు దంపతులు సత్కరించుకున్నారు. ఈ కార్యక్ర మంలో అప్పలరాజు కుటుంబ సభ్యులు, వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

### నీతీశ్ కుమార్‌ను ఢీకొట్టబోయిన బైక్

## ఫుట్‌పాత్‌పైకి దూకిన సీఎం



పట్నా: బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ భద్రతలో భారీ వైఫల్యం చోటుచేసుకోవడం తీవ్ర కలకలం సృష్టించింది. సీఎం తన ఇంటి నుంచి బయటకు వచ్చిన సమయంలో కొందరు వ్యక్తులు బైక్‌పై ఆయనకు అత్యంత సమీపానికి వచ్చారు. ముఖ్యమంత్రి భద్రతా వలయాన్ని ఛేదించుకుని దాదాపు ఆయనను ఢీకొట్టినంత పనిచేశారు. అప్రమత్తమైన నీతీశ్ వెంటనే ఫుట్‌పాత్‌పైకి దూకారు. గురువారం ఉదయం సీఎం మార్నింగ్ వాక్ చేస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.

ముఖ్యమంత్రి నీతీశ్ వాకింగ్ చేసేందుకు తన ఇంటి నుంచి సర్క్యులర్ రోడ్డుకు వెళ్లారు. దీంతో ఆ మార్గంలో పోలీసులు భద్రతను ఏర్పాటు చేశారు. అయితే ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు రెండు బైక్‌లపై ఆ మార్గంలోకి వచ్చారు. భద్రత వలయాన్ని దాటుకుని సీఎం నడుస్తున్న వైపు వేగంగా దూసుకొచ్చారు. వీరిని గమనించిన నీతీశ్ వెంటనే అప్రమత్తమై రోడ్డు పక్కనే ఉన్న ఫుట్‌పాత్‌పైకి దూకారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

వెంటనే భద్రతా సిబ్బంది బైకర్లను వెంబడించి అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఘటనాస్థలంలో సీసీటీవీ దృశ్యాలను కూడా పరిశీలిస్తున్నారు. ఇది పొరపాటున జరిగిందా లేదా దీని వెనుక ఇంకేదైనా ఉద్దేశం ఉందా? అనే కోణంలో దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఘటన అనంతరం ఎస్ఎస్‌జీ కమాండెంట్, పట్నా ఎస్ఎస్పీని నీతీశ్ తన ఇంటికి పిలిపించి సమావేశమయ్యారు. ఘటన జరిగిన సర్క్యులర్ రోడ్డులో మాజీ సీఎం రబ్రీదేవి సహా పలువురు రాజకీయ నాయకుల నివాసాలున్నాయి.

## 'గడపగడప'లో జగన్మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపిన మహిళ





అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): అనకాపల్లిలో ఓ మహిళకు తనను ఆదుకున్న ప్రభుత్వానికి, అందుకు సహకరించిన మంత్రి అమర్నాథ్ కు కృతజ్ఞతలు చెప్పే అవకాశం లభించింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

అనకాపల్లి పట్టణంలోని 82వ వార్డు శారద కాలనీలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ బుధవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం కార్పొరేటర్ మందపాటి సునీత, వైఎస్ఆర్సిపి పట్టణ పార్టీ అధ్యక్షుడు మందపాటి జానకి రామరాజు ఆధ్వర్యంలో జరిగింది. గడపగడపకు ఆయన వెళుతున్న సమయంలో ఎన్. సువర్ణ కృతజ్ఞతా భావంతో మంత్రి అమర్నాథ్ వద్దకు వచ్చారు. ఆమె చాలా కాలంగా గుండె జబ్బుతో బాధపడుతున్నారు. వైద్య సహాయం తీసుకునేందుకే ఇబ్బంది పడుతున్న ఆమెకు ఓపెన్ హార్ట్ సర్జరీ చేయాలని డాక్టర్లు చెప్పారు. సుమారు లక్ష 80 వేల రూపాయల ఖర్చులు ప్రభుత్వమే భరించి సువర్ణకు ఆపరేషన్ చేయించి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆమెకు మళ్ళీ ప్రాణం పోసింది. ఇది ఆమె గుర్తుంచుకొని బుధవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మంత్రి అమర్నాథ్ సువర్ణ ఇంటికి వెళ్లినప్పుడు ప్రభుత్వం చేసిన సహాయాన్ని మంత్రికి చెప్పి తన ప్రాణం నిలబెట్టినందుకు తనకు, ఈ ప్రభుత్వానికి తాను ఎప్పుడు మద్దతుగా నిలుస్తానని చెప్పుకొచ్చారు.

ఇదిలా ఉండగా ఈ కాలనీలో సుమారు 50 లక్షల రూపాయలతో నిర్మించనున్న కల్వర్టుల్లు ,కాలువల నిర్మాణానికి మంత్రి అమర్నాథ్ శంకుస్థాపన చేశారు.

అనంతరం మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ విద్యాధికులు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలు నివసించే ప్రాంతంలో గతంలో 50 లక్షల రూపాయలతో రోడ్లు కాలువలు నిర్మాణం చేపట్టామని ఇప్పుడు కూడా మరో 50 లక్షల రూపాయలతో కల్వర్టులు, కాలువల నిర్మాణం చేపడుతున్నామని తెలియజేశారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి వెళ్ళినప్పుడు లబ్ధిదారులు వారు పొందిన లబ్ధి గురించి తనకు చెప్పి ఆనందిస్తున్నారని వివరించారు. అనకాపల్లి పట్టణంలో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి అనకాపల్లి ప్రజలు సహాయ సహకారాలు అంది స్తున్నారని, వచ్చే ఎన్నికల్లో కూడా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రజలు తీసు కోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్ మందపాటి సునీత, వైసీపీ నాయకులు డాక్టర్ రామ్మూర్తి, జాజుల రమేష్, గైపూరి రాజు, వైసీపీ నాయకులు పెద్ద ఎత్తున స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కన్న కొడుకు ఆదరించలేదని జగనన్నకి చెప్పారు



రావికమతం, (విశాఖ సమాచారమ్): రావికమతం మండలం తోటకూరపాలెం గ్రామానికి చెందిన లాలం పైడితల్లి, లాలం రాజులమ్మ భార్యాభర్తలు. ఇద్దరు వృద్ధులు. వీళ్ళిద్దరూ జగనన్నకి చెబుదామని కాల్‌కి ఫోన్ చేసి తమ కుమారుడు తాతబాబు తమని చూడటం లేదని ఫిర్యాదు చేసారు. వృద్ధాప్యంలో వలన తాము ఏ పని చేయలేక ఆకలితో అలమటిస్తున్నామని, ఉన్న ఒక్క కొడుకు తమని విడిచిపెట్టాడనీ వాపోయారు. వారిచ్చిన సమాచారం మేరకు జిల్లా ఎస్పీ సమాచారంతో కొత్తకోట సర్కిల్ ఇన్స్పెక్టర్ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్, రావికమతం సబ్ ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వరరావు హుటాహుటిన తోటకూరపాలెం వెళ్లి గ్రామ పెద్దలను పిలిపించారు. కుటుంబ సభ్యులను పిలిచి మాటలాడి కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం గ్రామ పెద్దల సమక్షంలో తల్లిదండ్రులని కుమారుడికి అప్పగించారు.

## 'జనవాణి'లో జనసేనాని



వారాహి యాత్రలో భాగంగా కాకినాడ జిల్లా గొల్లప్రోలులో నిర్వహించిన 'జనవాణి' కార్యక్రమానికి పవన్ కల్యాణ్ హాజరయ్యారు. అనంతరం అక్కడ దివ్యాంగులతో ఏర్పాటు చేసిన ముఖాముఖిలో ఆయన మాట్లాడారు.

## కొత్తకోటలో మణికంఠ సామిల్ సీజ్

రావికమతం, (విశాఖ సమాచారమ్): రావికమతం మండలం కొత్తకోట మేజర్ పంచాయతీ గ్రామంలో ఇటీవల స్థానిక మణికంఠ సా మిల్ పై అటవీశాఖ అధికారులు దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ దాడుల్లో అపరాధ రుసుముగా అదే రోజు 25 వేల రూపాయలు చెల్లించాలని వారికి నోటీసులు ఇచ్చారు. దీనికి సంబంధించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డి.ఎఫ్.ఓ ఈ సామిల్‌ని సీజ్ చేస్తున్నట్టుగా కూడా ప్రకటించారు. మణికంఠ సామిల్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం వల్ల సంజాయిషీ తెలపాలని సంబంధించి నోటీసు ఇవ్వడమే కాకుండా సా మిల్‌ని సీజ్ చేసినట్లుగా స్థానిక అధికారులు తెలిపారు. సా మిల్ సీజ్ చేయడంతో స్థానిక దిగు స్థాయి బీట్ అధికారి సామిల్ కి వెళ్లి తాళలు వేసి స్వాధీనపరుచుకున్నారు.

## శ్రీ పట్టాలమ్మ అమ్మవారిని దర్శించుకున్న టీడీపీ నాయకులు



రావికమతం, (విశాఖ సమాచారమ్): చోడవరం నియోజకవర్గం రావికమతం మండలం కొగుంట పంచాయితీ గుడ్డిబంధ గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పట్టాలమ్మ తల్లి పండుగ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుండి భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించి తమ తమ మొక్కులు తీర్చుకున్నారు .ఈ కార్యక్రమానికి నూతన ఎమ్మెల్సీ చిరంజీవి రావు, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు, నియోజకవర్గ ఇన్చార్జ్ బత్తుల తాతయ్య బాబు, మండల పార్టీ అధ్యక్షులు రాజన్న కొండ నాయుడు, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారికి ఘన స్వాగతం పలికారు అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి నైవేద్యాలు నివేదించారు.

క్లాసిఫైడ్స్, ప్రకటనల కొరకు సంప్రదించండి
8186030813,
7981904385

Plot For Sale
267 sq yrds vuda plot sale at Raviraj ventures baligattam kothavalasa 16000/- sq yrds slight negotiable.
Please Contact : 7729929555.

పాఠకులకు హెచ్చరిక
విశాఖ సమాచారమ్ తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
సెల్: 8186030813

General, Bluestar and Vestar 3*, 5* and Inverter Technology ACs are available at project cost. Contact for bulk supply for hospitals, function halls, resorts, Hotels, PGs, Apartments, Villa projects for special price.
The Associate Services(Navimuki Group)
Ap&Ts. 1Ton Non-Inv
Price Starts from 28860/- onwards
whatsapp : 919948013444




# టిడిఆర్ హబ్ ఆధ్వర్యంలో రీసెర్చ్ మెథడాలజీ తరగతులు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్ర విశ్వవిద్యాలయం ట్రాన్స్ డిసిప్లినరీ హబ్ ఆధ్వర్యంలో రీసెర్చ్ మెథడాలజీపై శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఏయూ హెచ్ఆర్డిసి కేంద్రంలో నిర్వహిస్తున్న ఈ తరగతులను రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ ప్రారంభించారు. బ్లెండెడ్ విధానంలో రెండు వారాలు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తారు ఈ సందర్భంగా పరిశోధకులను ఉద్దేశించి రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ పరిశోధనలు సమాజా ఉపయుక్తంగా నిలవాలని సూచించారు. ట్రాన్స్ డిసిప్లినరీ రీసెర్చ్ హబ్ని నెలకొల్పిన తొలి వర్సిటీగా ఏయూ నిలుస్తుందన్నారు. పరిశోధన ఆసక్తిని గుర్తించి వారిని ప్రోత్సహించడం దీని ప్రధాన ఉద్దేశం. రెండు వారాల శిక్షణలో భాగంగా నిపుణులతో అవగాహన, ప్రత్యక్ష శిక్షణ అందించడం, మెళకువలను నేర్పించడం జరుగుతుంది. ఉత్తమమైన అంశాలను పరిశోధనకు ఎంపిక చేసుకోవడం, సమాజ ఉపయుక్త పరిశోధనలు జరపడానికి ఇది ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. పరిశోధకుల నైపుణ్యాలను మరింత ద్విగుణీకృతం చేయడం శిక్షణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. వైవిధ్యమైన అంశాలపై పరిశోధనలు జరపాలని ఆయన సూచించారు. విశ్వవిద్యాలయానికి పేరు తెచ్చే విధంగా పరిశోధనలు సాగాలన్నారు. కార్యక్రమానికి సమన్వయకర్తగా ఆచార్య ఎన్.ఏ.డి పాల్ వ్యవహరిస్తున్నారు.

ఏయూ టిడిఆర్ హబ్ డీన్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు.

# రోజువారీ కంటిపరీక్షలు పెరగాలి



**విజయనగరం:** జిల్లాలో వై.ఎస్.ఆర్. కంటివెలుగు కార్యక్రమంలో రోజువారీ కంటిపరీక్షలను నిర్దేశిత లక్ష్యం మేరకు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి నేత్రవైద్య సహాయకులను ఆదేశించారు. కంటి పరీక్షలు చేయడంలో గ్రామ, వార్డు వాలంటీర్లు సహకరించేలా ఆదేశాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే కంటిపరీక్షలు పూర్తయిన వారికి కళ్లద్దాల పంపిణీని త్వరగా పూర్తిచేయాలని చెప్పారు. కలెక్టర్ కార్యాలయంలో ఈ కార్యక్రమంపై సమీక్షిస్తూ జిల్లాలో కంటి వెలుగులో గుర్తించిన 5 వేల మందికి శస్త్రచికిత్సలు పూర్తిచేయాల్సి ఉందని, వారందరికీ నిర్దిష్ట వ్యవధిలో చికిత్సలు చేసేందుకు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొంటున్న ప్రైవేటు ఆసుపత్రులు వారికి కేటాయించిన ప్రాంతాల్లో శస్త్రచికిత్స శిబిరాలు నిర్వహించి తమకు కేటాయించిన లక్ష్యాల మేరకు పూర్తిచేయాలని ఆయా శిబిరాలకు అర్హులైన వారిని రప్పించడంలో గ్రామ, వార్డు వాలంటీర్ల ద్వారా తగిన సహకారం అందించేలా చర్యలు చేపడతామన్నారు. కళ్లద్దాల పంపిణీలో వైద్యాధికారుల సహకారం అందించేలా చర్యలు చేపడతామని కలెక్టర్ చెప్పారు. కంటి చికిత్సలు చేయించుకొనే వారికి రవాణా సౌకర్యాలు కల్పించినట్లయితే మరింత ఎక్కువ మందికి చేయడం సాధ్యమవుతుందని పుష్పగిరి, శంకర్ ఫౌండేషన్ తదితర ఆసుపత్రుల ప్రతినిధులు వివరించారు. జిల్లాలో కంటివెలుగు కార్యక్రమంలో సాధించిన ప్రగతిని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డా.శివప్రసాద్ వివరించారు. జిల్లాలో 8 బృందాల ద్వారా కంటి తనిఖీలు చేస్తున్నట్టు చెప్పారు.

కంటివెలుగు కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ క్షేత్రస్థాయి సిబ్బంది సహకారం అందించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి భాస్కరరావును ఆదేశించారు. ఈ సమావేశంలో వై.ఎస్.ఆర్. కంటివెలుగు అధికారి తారక్, అనిల్ నీరుకొండ ఆసుపత్రి, షాలోమ్ కంటి ఆసుపత్రి ప్రతినిధులు, ఆప్తాల్మిక్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# రాత్రిపూట ప్లాంట్ లెవెల్ మాక్ డ్రిల్ నిర్వహించిన ఆర్ఐఎన్ఎల్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్లో పూత ఎమర్జెన్సీ సన్నద్ధతను నిర్ధారించడంలో భాగంగా ప్లాంట్ లెవల్ నైట్ టైమ్ మాక్ డ్రిల్ నిర్వహించబడింది. శ్రీ జె శివశంకర రెడ్డి, జాయింట్ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, ప్రభుత్వ. ఏపీకి చెందిన విశాఖపట్నం వారి ఆధ్వర్యంలో రాత్రి మాక్ డ్రిల్ ను ఆర్ఎన్ఎల్లో నిర్వహించారు.

విశాఖపట్నం స్టీల్ప్లాంట్లోని యుటిలిటీస్ డిపార్ట్మెంట్లోని ఎయిర్ సెపరేషన్ యూనిట్-5లోని ఎల్ఐఎన్ (లిక్విడ్ నైట్రోజన్) ట్యాంక్ నుండి నైట్రోజన్ లీకేజీ యొక్క అత్యవసర దృశ్యం కృత్రిమంగా అమలు చేయబడింది, దీనిలో 3 వ్యక్తులు నిర్వహణ కార్యకలాపాలకు హాజరైనప్పుడు చలి, కాలిన గాయాలు మరియు ఊపిరాడకుండా ప్రభావితమైనట్లు పరిగణించబడింది.

ఉద్యోగులు బిగ్గరగా కేకలు వేయడంతో, సంఘటన కంట్రోలర్ వెంటనే అత్యవసర ప్రతిస్పందన విధానాలను ప్రారంభించారు. తదనంతరం, యుటిలిటీస్ డిపార్ట్మెంట్ ఉద్యోగులు, సిఐఎస్ఎఫ్ ఫైర్ అండ్ సెక్యూరిటీ, మెడికల్ సర్వీసెస్, గ్యాస్ సేఫ్టీ, సేఫ్టీ డిపార్ట్మెంట్, ఎన్విరాన్ మెంట్ మేనేజ్మెంట్ డిపార్ట్మెంట్ మొదలైన వాటితో సహా విఎస్పి యొక్క అన్ని బృందాలు పరిస్థితిని నియంత్రించడానికి, బాధిత సిబ్బందిని రక్షించడానికి మరియు నష్టాలను తగ్గించడానికి అత్యవసర ఉపశమన చర్యలను ప్రదర్శించాయి.

మాక్ డ్రిల్ సమయంలో, స్థిర మరియు మొబైల్ అగ్నిమాపక సంస్థాపనలు, నీటి తెర వ్యవస్థలు, ప్రథమ చికిత్స మరియు రెస్క్యూ పరికరాలు మొదలైనవి సమర్థవంతంగా అమలు చేయబడ్డాయి. మాక్ డ్రిల్లో భాగంగా ఉద్యోగులు మరియు సిఐఎస్ఎఫ్ సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు మరియు స్వీయ-నియంత్రణ శ్వాస ఉపకరణం మరియు ఇతర అత్యవసర ప్రతిస్పందన పరికరాలను ఉపయోగించి బాధిత వ్యక్తులను సంఘటన స్థలం నుండి రక్షించారు.

ఉద్యోగులకు సమర్థవంతంగా శిక్షణ ఇవ్వడం మరియు అత్యవసర సమయాల్లో సంసిద్ధతను ప్రదర్శించడంలో ఆర్ఐఎన్ఎల్ చేస్తున్న కృషిని జె.శివ శంకర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

సిజిఎం (సర్వీసెస్) మరియు ఫ్యాక్టరీ మేనేజర్ శ్రీ ఎంఎస్వి కృష్ణయ్య మాక్ డ్రిల్ను వీక్షించారు. హెచ్ఓడి (ఎస్ఇడి) ఎన్.కె. రౌట్, జిఎం (సేఫ్టీ) ఐ/సితో పాటు యుటిలిటీస్ డిపార్ట్మెంట్, డబ్ల్యూఎండి, సేఫ్టీ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ నుండి సీనియర్ అధికారులు మాక్ డ్రిల్కు హాజరయ్యారు.

ఆర్ఐఎన్ఎల్ యొక్క పరస్పర సహాయ భాగస్వాములైన ఎం/ఎస్ ఎన్టిపిసి-సింహాద్రి మరియు ఎం/ఎస్ హిందూజా పవర్ ప్లాంట్, ఇతర ప్రభుత్వం. ఎన్డిఆర్ఎఫ్ (నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) మరియు ఎస్డిఆర్ఎఫ్ (స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) అధికారులు కూడా మాక్ డిల్కు హాజరయ్యారు.










## ఆస్తి పన్ను చెల్లింపు దారులకు శుభవార్త

### జూన్ 30 లోగా పన్ను చెల్లిస్తే వడ్డీ లేదు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ ఆస్తి పన్ను చెల్లింపు దారులు 2023-24 మొదటి అర్థ సంవత్సరము పన్ను జూన్ 30వ తేదీ లోగా చెల్లించినట్లయితే వడ్డీ ఉండదని జివిఎంసి కమిషనర్ సి.ఎం. సాయికాంత్ వర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జివిఎంసి పరిధిలోని ప్రభుత్వ నిబంధనల ప్రకారం 2023 అర్థ సంవత్సరమునకు సంబంధించి జూన్ 30వ తేదీలోగా ఆస్తి పన్ను చెల్లింపు దారులకు వడ్డీ ఉండదని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని జివిఎంసి పరిధిలోని ఆస్తి పన్ను చెల్లింపుదారులందరూ సద్వినియోగం చేసుకుంటూ విశాఖ నగర అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కమిషనర్ తెలియజేశారు.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 7013118088, Simhachalam : Cell: 96660 15921, Paravaada : Cell: 77804 33919, Aarilova : Cell: 97050 51389,
Cheedikaada : Cell: 97686 33999, Vsp City : 8186030813.